సెప్టెంబర్ - 2019

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక మాస పత్రిక


ప్రధాన సంపాదకులు :

**రెవ.డా|| కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

చందా వివరాలు :

సంవత్సర చందా రూ. 250/-

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-



చిరునామా :

ఎడిటర్, పరిశుద్ధత

పోస్ట్‌బాక్స్ నెం. 28, క్లౌపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9704255416



బ్యాంక్ అకౌంట్ వివరాలు :

A/c Name: **K. Joseph**

A/c No.: **10957380353**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890


## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| తిమోతి | కొడవటికంటి | 03 |
| శాశ్వత రక్షణ | రెవ.డా||కె.జోసఫ్‌గారు | 06 |
| క్రైస్తవజీవిత దృక్కోణం | పి.రంజిత్ కుమార్ | 08 |
| రూతు | రేచెల్ జోసఫ్ | 10 |
| మదర్ తెరీసా | బ్రదర్ కె. సామ్రాట్ | 12 |
| దేవుడు-సిరి | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 14 |
| సాక్ష్యము | శ్రీమతి సరళ | 15 |
| బైబిలు కథలు- ఎలీషా | రెవ.డా||కె.జోసఫ్‌గారు | 18 |
| క్రొత్త కోణాలు | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 20 |
| అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | 24 |



INDIA EVANGELISTIC & RELIEF FELLOWSHIP

EVANGELISM
- Church Planting
- Evangelistic Crusades
- Pastor's Seminars
- Youth Ministry
- T.V.Ministry
- Magazine Ministry
- Audio Ministry
- Jail & Prison Ministry
- IERF International Ministry
- Hanna Women Ministries

RELIEF
- Orphanage
- Child Development Centers
- Education (U.C.L.I. Schools)
- Widows & Lepers Care
- Medical Assistance
- Help in Natural Calamity
- Flood Relief
- Mobile Medical Ministry
- Children Care Ministry

# సంపాదకీయం.....



ప్రియ పరిశుద్ధత పాఠకులకు ప్రభువు నామమున శుభాభివందనములు.

పత్రికను ఆదరిస్తున్నందుకు మీకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. రోజులు చాలా త్వరగా గడచి పోతున్నాయి. దేవుని రాకడ సమీపమవుతుంది. మనుష్యులంతా ధన సంపాదనలో చాలా బిజీగా ఉన్నారు. రేపు అనబడే భవిష్యత్తు గురించి ప్రణాళికలు వేసుకుంటున్నారు. రేపు ఎలా బ్రతకాలన్న భయంతో తమ ఆత్మను రక్షించుకోవాలన్న ఆలోచన లేకుండా తమ శరీరాన్ని బ్రతికించుకోవడానికి చింతిస్తున్నారు. రేపటి రోజు మానవులకు క్రొత్తరోజు. రేపు ఇంతకముందు ఎన్నడూ రాలేదు. మరలా మన కొరకు రాదు. మనల్ని వెంబడిస్తూ, భయపెడుతూ వస్తున్న క్రొత్తరోజును చూసి భయపడవద్దు అన్నాడు ప్రభువు. రేపటిని గూర్చి చింతింపకుడి రేపటి దినము దాని సంగతులను గూర్చి చింతించును అన్నాడు. మనుష్యులు భయపడటానికి ముఖ్యకారణం దేవుని మరచిపోవటం. మనం మరణించేటంత వరకు మనల్ని విడువక ఎడబాయక కాపు కాస్తున్న దేవుని వాగ్ధానాన్ని గ్రహించకపోవటం. యెహోవా నా కాపరి అని నమ్మకపోవటం. కొందరు అన్ని విషయాలలో సమృద్ధిగా ఉన్నా, వారికి రేపు అనే విషయం ఆందోళన కలిగిస్తుంది. కొందరు వచ్చేవారం గురించి, మరికొందరు వచ్చే నెల గురించి, మరి కొందరు వచ్చే సంవత్సరం గురించి భయపడుతుంటారు. అందుకే ప్రభువు ఏనాటి కీడు ఆనాటికే చాలును అన్నాడు. అంటే మనం ఈ రోజు విషయం సంతృప్తి కలిగి ఉండమని. అన్నిటికంటే ముఖ్యమైనది మనం విడిచి వచ్చిన మార్గము మనం మరచిపోతుంటాము. మనం నడవబోయే మార్గాన్ని గురించి దిగులు పడటానికి కారణం ఇదే. కాబట్టి ప్రతి ఒక్కరూ ప్రభువునుబట్టి ధైర్యముగా ఉండమని మనవి చేస్తున్నాను.

దయచేసి చందా కట్టని వాళ్ళు, మీ సంవత్సర చందా కట్టి పత్రిక అభివృద్ధికి తోడ్పడవలసినదిగా కోరుచున్నాను. మీరు నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేయదలచి నట్లయితే మా అకౌంట్ నంబర్‌కి ట్రాన్స్‌ఫర్ చెయ్యండి. K. Joseph, A/c No. 10957380353, SBI Main Branch, Ongole, IFSC Code SBIN0000890. మీరు ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేసినట్లయితే దయచేసి మాకు 9440217726 నంబర్‌కి ఫోన్ చేసి చెప్పండి లేదా మీ పేరు, పత్రిక అడ్రస్ లేబుల్ మీద మీ సీరియల్ నంబర్, ట్రాన్స్‌ఫర్ చేసిన మొత్తం SMS చెయ్యండి. దేవుడు మిమ్మును సదాకాలము దీవించును గాక! ఆమెన్!

–ఎడిటర్

**K. Joseph, SBI Main Branch, Ongole**
**A/c No. 10957380353**

| సీరియల్ నంబరు | |
|---|---|

సీరియల్

# తిమోతి

**18**

**(అపొస్తలుడు మూడవభాగం)**

**– కొడవటికంటి**

తిమోతి కృతజ్ఞతతో పౌలు వైపు చూశాడు. అకుల ఏర్పాటు చేసిన పరుపు మీద పౌలు విశ్రాంతిగా పడు కున్నారు. మరునాడు ఉదయాన్నే అకుల కర్మాగారపు గదిలో నికి వెళ్ళి నిన్న పని ఆపిన చోట దేరాని సరిచేస్తు న్నాడు.పౌలు లోపలికి వచ్చి “పని ఎట్లున్నది” అని అన్నాడు. అకుల పౌలు వైపు చూచి “చాలా ఎక్కువగానే ఉంది. సమయానికి అందించటం కష్టంగానే ఉంది” అన్నాడు. “ఎఫెసులోనే కొంతకాలం, అంటే కొన్ని సంవత్సరాలు గడపాలని ఆలోచన, ప్రభువు చిత్తము ఎట్లున్నదో అని ఈ ప్రక్కగా నాకు పని చెయ్యటానికి సామాను సమకూ ర్చండి” అని బయటకు వెళ్ళాడు.

సొస్తెనేసు వచ్చాడు. నడవలో కూర్చుని పౌలు, సొస్తెనేసు కొరింథీ సంగతులు, అక్కడి వ్యక్తుల మంచి చెడ్డలు మాట్లాడుతున్నారు. తిమోతి కూడ వారితో పాటు కూర్చుని వింటున్నాడు. కొన్ని సంతోషించదగినవి, కొన్ని బాధ కలిగించేవి. దాదాపు అరగంట మాట్లాడుకున్న తర్వాత పౌలు లేచి నిలుచున్నారు. “తిమోతి నువ్వు కొరింథు వెళ్ళి రావాలి” అని అన్నాడు. పౌలు ఇలా అంటారని ముందే ఊహించాడు. ఇక సంఘాల మంచి చెడులు విచారించి రావటం తన కర్తవ్యమనుకున్నాడు.

వారమంతా పని తీరుబడి లేకుండా ఉంది అయినా పని చేసినంత సేపు పాత నిబంధన ధర్మశాస్త్రము ప్రవక్తల వచనాలు, కీర్తనల గ్రంథం మీద చర్చ ఎక్కువగా జరుగు తుండేది. అందువల్ల పని అంత భారంగా అనిపించలేదు. యూదుల సమాజమందిరం కొంచెం పెద్దదే. అయినను యెరూషలేములోని యూదులవలె ఛాందసత్వముగాని రబ్బీల పలుకుబడి గాని ఎక్కువగా లేదు. రెండునెలలు గడిచేటప్పటికీ పట్టణమంతా పరిచయమై పోయింది. ఎక్కడ ఎవరికి జబ్బుచేసినా ఇంకా ఏదైనా సాతాను శక్తుల బాధవున్నా పౌలు వద్దకు వస్తుండేవారు. పౌలు ప్రసంగం వినటానికి సబ్బాతు దినాన మందిరం నిండిపోయేది.

ఒకరోజు ఆరాధన ముగిసిన తర్వాత ఇద్దరు శిష్యులు పౌలుని కలిశారు. అర్తిమాదేవి ఆలయానికి తూర్పుగా రెండు మైళ్ళదూరంలో ఉన్న యూదుల అగ్రహారానికి రావలసిందని పౌలుని మరీ బలవంతం చేస్తే ఆయన తిమోతి కలిసి దాదాపు మూడు మైళ్ళు నడచి వెళ్ళారు. పట్టణానికి దూరంగా నివశిస్తున్నా అందరూ పట్టణంలో ఏదో ఒక వ్యాపార చేసేవారే. ఆ సాయంకాలం ప్రార్ధన కూటమునకు అక్కడ కూర్చుంటు న్నప్పుడు పురుషులు ఇంచుమించు పదిహేను మంది కూడారు. పౌలు వారితో మాట్లాడుతూ యెరూషలేము నుండి ఇరవైఐదు సంవత్సరాల క్రితం ఇక్కడికి మేము వచ్చామని చెప్పారు.

“మీరు యేసుని చూశారా?” అని పౌలు అడిగాడు. “చూడలేదు కాని యోహాను ఆయనను గురించి చెప్పి నప్పుడు విని రక్షింపబడ్డాము” అని చెప్పారు. “మీరు విశ్వసించినప్పుడు పరిశుద్ధాత్మను పొందారా?”అని అడిగాడు. వారిలో ఎల్నాఫాను. “పరిశుద్ధా త్ముదున్నాడను సంగతే మేము వినలేదు” అని అన్నాడు.

‘‘ఆలాగైతే మీరు దేనిని బట్టి బాప్తిస్మము పొందితిరి?’’ అన్నాడు. ‘‘యోహాను బాప్తిస్మమును బట్టియే’’ అన్నాడు. అప్పుడు పౌలు ఆ కూటంలో యేసుని గురించి, పరిశుద్ధాత్మ వరములను గురించి చెప్పి వారికి బాప్తిస్మం ఇచ్చి వారి మీద పౌలు చేతులుంచగానే వారు భాషలతో మాట్లాడుతూ ప్రవచించసాగిరి.

పౌలుకి సమాజమందిరంలోను, క్రైస్తవ సమాజం

లోనే కాక స్థానిక విద్యావంతులు, శాస్త్రవేత్తలు, పండితుల తో కూడా పెరిగిన పలుకుబడిని చూసి మొదట ఆదరించిన యూదులే వ్యసనపడసాగారు. అయితే వారి వ్యతిరేకత ఒక్కసారిగా బయలుపడలేదు. కాని చాటుగా మనస్సునకు బాధ కలిగించే విధంగా ప్రవర్తించే వారు. ఈ విషయం ఒకరోజు తురన్నతో ప్రస్తావించాడు. తురన్న వృద్ధుడు కాకపోయినను పండితుడు అనే బిరుదు కలిగినవాడు. గ్రీకు భాషలో విశేష పాండిత్యం కలిగి స్వంతగా ఒక విద్యాశాఖను నిర్వర్తిస్తుండేవాడు. పాత నిబంధనలోని శ్రేష్ఠమైన బోధలయందు అమితమైన విశ్వాసం కలదు. దేవునికి భయపడి ఎల్లప్పుడు ఇతరు లకు మేలు చేయుచుండేవాడు.

తురన్న పౌలుకి వచ్చినదంతా ఇంతకు ముందే గ్రహించి యున్నందున వెంటనే తన పాఠశాలను ఉదయం అయిదు గంటల నుండి పది గంటల వరకు ఉపయో గించుకోమని చెప్పాడు. ఒక విధంగా యూదుల వల్ల కలిగిన అసౌకర్యం క్రీస్తు సువార్త బోధనకు సరళ మునై మార్గము చేకూర్చబడింది. పట్టణంలో పేరు ప్రఖ్యాతలు కలిగిన పాఠశాల అయినందున యూదులు గ్రీసు దేశస్తులు, పౌలు బడిలో శిష్యులుగా చేరి అనేక ఆత్మీయ వరములు పొందినందున పట్టణంలో తురన్న పాఠశాల ఒక ప్రత్యేకత సంతరించుకుంది.

ఒకరి తర్వాత ఒకరు అన్నీ వర్గాల వారు యేసు నామమును తెలుసుకొననారంభించారు. అందులో దేశసంచారులు, మాంత్రిక విద్య తెలిసిన వారు కూడా ఉన్నారు. వారు వారి వృత్తి మానివేసి క్రైస్తవులయ్యారు. ఎక్కడ చూసినా యేసు నామమే. ఈ విధంగా ఒక సంవత్సరం గడిచిపోయింది. లూకా ఈ మధ్యలో రెండుసార్లు ఫిలిప్పీ నుండి వచ్చి, బెరయ, థెస్సలొనీకలో జరుగుతున్న సేవను వివరించి వెళ్ళారు. తిమోతి కొరింథీ పట్టణానికి వెళ్ళి కొన్ని దినాలు అక్కడి సంఘాలను చూచి రమ్మని పంపించాలను కుంటుండగానే అపొల్లో కొరింథి నుండి ఎఫెసు వచ్చి పౌలుని కలుసుకున్నారు.

అపొల్లో తన సేవా ఫలితమును గురించి, కొరింథీ సంఘంలోని సంఘస్తులను గురించి, పౌలు అత్యవసరం గా కొరింథు సంఘమును దర్శించవలసిన అవసరత గురించి చెప్పాడు. గనుక పౌలు కొరింథు పట్టణానికి వెళ్ళి ఒక నెలరోజులు ఆ సంఘములో నివశించి తిరిగి ఎఫెసు వచ్చారు. తర్వాత మరలా సొస్తెనేసును కొరింథి పట్టణానికి పంపించాడు. సొస్తెనేసు తిరిగి ఎఫెసుకు వచ్చి పౌలు తాను రెండవసారి కొరింథుకు వెళ్ళి సంఘంలో చేసిన సవరణలన్నీ నీరుగారి పోయాయని చెప్పాడు. పౌలు హృదయంలో బహుగా కృంగిపోయాడు. ప్రభువు సన్నిధిలో కొన్నిరోజులు గడిపి ఒక పత్రిక వ్రాసి తీతు చేతికి ఇచ్చి పంపించాడు. తీతు చాలా నిబ్బరము కలిగి కఠినంగా వ్యవహరించే వ్యక్తి. అతను తిరిగి వచ్చిన మూడు రోజులకే ఎఫెసులో నివశిస్తున్న క్లెయో యొక్క బంధువులు కొరింథు నుండి వచ్చి పౌలుని కలుసు కున్నారు. పౌలు అప్పుడే పాఠశాల నుండి ఇంటికి వచ్చారు. వారితో కొంచెంసేపు మాట్లాడిన తర్వాత కొరింథు సంఘంలోని కక్షల గురించి విపులంగా తెలుసు కున్నాడు.

ఒక వారం తర్వాత కొరింథు నుండి ముగ్గురు సంఘస్తులు పౌలు యొద్దకు వచ్చారు. వారు కొరింథు లోని సంఘస్తులందరితో కలిసి యోచించి తయారు చేసిన పత్రికను పౌలుకు ఇచ్చారు. వారు పౌలు యొద్ద కొన్ని రోజులు గడపవచ్చారు. వారు వచ్చిన తర్వాత పౌలు తిమోతిని ఏథెన్సు పట్టణం, మరి కొన్ని దగ్గర పట్టణాలలో యెరూషలేము సంఘానికై చందాలు వసూలు చేసి కొరింథు పట్టణాన్ని కూడా దర్శించి రమ్మన్నారు. పౌలు సొస్తెనేసుతో కొరింథీయులకు రెండవ పత్రిక వ్రాయించి కొరింథు నుండి వచ్చిన స్తెఫను, ఫోర్తునాకు, అకయుకు అను వారికిచ్చి పంపించారు. అక్కడి సమాచారం తీసుకొని వచ్చుటకు తీతును వారి వెంట

పంపించాడు.

ఎఫెసుకు వచ్చిన తర్వాత మూడవ సంవత్సరం సేవ ఎంతగా విస్తరించిందో శ్రమలు కూడ అంతగానే విస్తరించాయి. మూడవ సంవత్సరం మొదట ద్యుపతి పండుగ వైభవంగా జరుగుతూ ఉంటుంది. ఎఫెసీయులు బహు ఉత్సాహంతో ఆచరిస్తారు. అయితే ముందు అన్యజనులుగా ఉండి ప్రభువును అంగీకరించి ఎఫెసీయులు కూడా ఈ పండుగను వైభవంగా ఆచరించాలనుకున్నారు. అందుకు ఒక ఏర్పాటు చేశారు. ఆ రోజున ప్రభువును విశ్వసించిన వారందరూ పెద్ద బహిరంగ సభ ఏర్పాటు చేసి పౌలుని అధ్యక్షునిగా చేశారు. విశ్వసించినవారు అనేకులు వచ్చి తాము చేసిన వాటిని తెలియచేసి ఒప్పుకున్నారు. మాంత్రిక విద్య అభ్యసించివారు అనేకులు తమ పుస్తకములను తెచ్చి అందరి ఎదుట వాటిని కాల్చివేశారు. మరునాడు స్థానిక యూదులలో గొప్ప అలజడి రేగింది. నిన్న కాల్చివేసిన మాంత్రిక విద్య పుస్తకముల విలువ యాభైవేల వెండిరూకలు ఉండవచ్చని అంచనా. అవన్నీ రోమా ప్రభుత్వము యొక్క పురాతన ప్రసిద్ధి ఘనత చెందిన సంపద అని అవి తగులబెట్టటానికి కారకుడు పౌలు అని ఫిర్యాదు చేశారు. అందువల్ల పౌలును బంధకములతో బంధించి న్యాయాధిపతి జూనియస్ సలానియస్ యొద్ద హాజరు పరచారు. కాని యూదుల వాదము వీగిపోయింది. పౌలు విడుదలయ్యాడు.

క్రీస్తు సువార్త ఫలితంగా అర్తిమాదేవి ఆలయంలో దేవయానిల సంఖ్య తగ్గిపోయింది. ఆలయ ప్రతిమల వ్యాపారము కూడా సన్నగిల్లింది. వ్యాపార కేంద్రాలలో వెండి ధర పడిపోయింది. ఈ గుళ్ళు చేసి అమ్ముకొని జీవించి కంసాలి వారి యొక్క ఆదాయం పడిపోవటంతో వారు అనేక విధాలుగా బాధపడనారంభించారు. పౌలు ఉదయాన్నే లేచి తురన్న పాఠశాలకు సిద్ధపడుతూ తన పైవస్త్రము కొరకు చూశాడు. అది ఎక్కడా కనిపించలేదు. ప్రిస్కిల్లను పిలిచి "నా పైవస్త్రము ఉతికావా?" అని అడిగాడు. "లేదు" అని చెప్పింది. "నా పైవస్త్రము చూడమ్మా నిన్న కూడా కనిపించలేదు" అని పెట్టెలో నుండి మరియొకటి తీసుకొని బయటకు వచ్చాడు.

బయట ఇద్దరు మనుష్యులు నిలుచుని ఉన్నారు. పౌలుని చూచి నమస్కరించి "అయ్యా, అపొల్లో కుమారుడు చాలా జ్వరంతో ఉన్నాడు. అయ్యగారు తమరిని ఒకసారి రమ్మన్నారు. లేదంటే మీరు ఎక్కడ ఉంటే అక్కడికి అబ్బాయిని తీసుకొని వస్తానన్నారు" అని చెప్పాడు.

"పాఠశాలకు వెళ్తున్నాను. అక్కడికి రమ్మనండి" అన్నాడు. తరువాత వారిలో ఒకరు వెంట వచ్చి "అయ్యా, అయ్యా" అని పిలిచాడు పౌలు ఆగాడు.

"అయ్యా, తమ చేతి రుమాలు అయినా ఇవ్వండి. మరలా పాఠశాలకు తెచ్చి ఇస్తాము" అన్నాడు.

"అది ఎందుకు" అన్నాడు పౌలు. ఆ వ్యక్తి ముందుకు వచ్చి చేతులు కట్టుకొని "తమరి శరీరమును తాకిన ఏ వస్త్రమైనను రోగుల మీద ఉంచిన స్వస్థత కలుగుతుంది" అన్నాడు.

పౌలుకి అప్పుడు అర్థమైంది తన పైవస్త్రములు ఎలా మాయమైపోయాయో. తన చేతి రుమాలు ఇచ్చి పాఠశాల వైపు బయలుదేరాడు.


**గమనిక**

**GNM మరియు B.Sc. Nursingలలో ఖాళీలు కలవు. మీ పిల్లలను చేర్చాలనుకొనే వారు వెంటనే ఈ క్రింది నంబర్లకు ఫోన్ చేసి మీ సీటు రిజర్వ్ చేసుకోండి**

**9676340371, 9704255416**



# శాశ్వత రక్షణ

రెవ.డా॥ కె.జోసఫ్

జయించిన వారే కానానులో ప్రవేశించారు. చాలామంది ప్రవేశింపలేకపోయారు. 1కొరింథీ.10:1-13లో చెప్పిన విధంగా వారందరూ ఒకే ఆహారము (మన్నా)ను భుజించారు. ఈ మన్నా క్రీస్తుకు సాదృశ్యము. ఒకే బండలోని నీరు త్రాగారు. ఆ బండ నీరు క్రీస్తుకు సాదృశ్యము. అయితే వారి అవిధేయత వలన దేవుని సంతోషపరచనందున చాలామంది అరణ్యములోనే రాలిపోయారు. అందరూ ఐగుప్తు నుండి విడుదల పొందిన వారే. చాలాసార్లు వీరు ఐగుప్తును జ్ఞాపకము చేసుకొని తిరిగి పోవాలని ఆశించినప్పటికీ కూడా విశ్వాస జీవితం నుండి పడిపోయినప్పటికీ (సంఖ్యా.14:1-4) వారి యాత్ర కొనసాగుతూనే వుంది. వారు దేవుని జనాంగముగానే పిలువబడ్డారు. వారు అలయలేదు, వారి వస్త్రములు పాతగిలలేదు. ఆశ్చర్యకరముగా వారికి దేవుడు ఆహారము నీరు అనుగ్రహిస్తూనే వున్నాడు. పాత నిబంధనలో ఎక్కడా వారు దేవుని పిల్లలు కారు అని వ్రాయబడలేదు. వారు వెయ్యేండ్ల పరిపాలనకు సాదృశ్యమైన కానానుకు చేరలేదు కాని చనిపోయి దేవుని దగ్గరకు అంటే నిత్యజీవానికి వెళ్ళారు. ఎందుకంటే వారు దేవుడు ఏర్పాటు చేసుకొనిన దేవుని జనాంగము. వాళ్ళంతా నిత్యజీవాన్ని పోగొట్టుకున్నారు అనుకొనుట అవివేకం. కనుక పైన చెప్పిన విధంగా రక్షించబడిన వారిని వారి తప్పిదములనుబట్టి దేవుడు శిక్షించునేగాని వారికి తన రక్షణకు దూరము చేయడు అనునది సత్యము, కనుక మన రక్షణ భద్రపరచబడియున్నది.

ఇప్పుడు విశ్వాసులకు యాకోబు 2:14-24లో చెప్పిన విధంగా రక్షణ ఉచితమే. అయితే మరి యాకోబు క్రియలు లేని విశ్వాసము మృతము అని ఎందుకు వ్రాశాడు అని ప్రశ్నిస్తారు. నిజమే చాలామంది విశ్వాసులు ఈ వాక్యభాగాన్ని పౌలు వ్రాసిన రోమా 3:26, 4:6 సరిగా సమన్వయం చేసుకోలేకపోతున్నారు. యాకోబు 2:12,13 వచనాలు విశ్వాసుల తీర్పుతో మొదలవుతాయి "తీర్పు పొందబోవు వారికి" తగినట్లుగా మాట్లాడుడి, ఆలాగుననే ప్రవర్తించుడి" అని ఇక్కడ వ్రాయబడింది. విశ్వాసులకు మాత్రమే వారు భూలోకంలో జీవించిన క్రైస్తవ జీవిత సరళిని (క్రియలను) బట్టి తీర్పు జరుగుతుందని కాని "నిత్యజీవము" పోగొట్టుకొనే ప్రసక్తి కాదు. వెంటనే క్రియలు లేని విశ్వాము వలన నీకేమి ప్రయోజనము ఆ విశ్వాసము నిన్ను రక్షిస్తుందా? (14) అని ప్రశ్నిస్తాడు. ఈ వచనమే విశ్వాసికి అర్థంకానిది. ఇక్కడ 'రక్షణ' అనే మాట సరిగా అర్థం చేసుకోవాలి. ఉదా: 'వాని ముఖంలో రంగుమారింది' అంటే నలుపు రంగు తెలుపుగానో, తెలుపు నలుపుగానో మారింది అని అర్థం కాదు. భావాలు మారినవి అని. రక్షణ అనే మాటకు గ్రీకు భాషలో 'నష్టపోకుండ కాపాడుట, అపాయము నుండి నాశనము నుండి భద్రపరచుట లేక 'స్వస్థత పొందుట' అనే అర్థాలను ఇస్తుంది (మార్కు 5:23, లూకా 8:36, అపొ.కార్య. 27:20) కనుక సందర్భాన్నిబట్టి ఈ రక్షణ అనే మాటను వాడాలి. కొన్ని సందర్భాల్లో మాత్రమే ఈ రక్షణ అనే మాట నిత్యనాశనము నుంచి రక్షించి నిత్యజీవము ఇచ్చే రక్షణ విషయంలో వాడబడింది (అపొ.16:31, ఎఫెసీ. 2:8). యాకోబులో మాత్రం ఈ రక్షణ అనే మాట వెయ్యేండ్ల పరిపాలనలో క్రీస్తు న్యాయపీఠం ఎదుట విశ్వాసులు పొందబోవు శిక్ష నుంచి తప్పించుట అనే అర్థముగా వాడబడింది. యాకోబు పత్రిక చెదరిపోయివున్న యూదుల రక్షణ కొరకు ప్రత్యేకంగా వ్రాయబడిందని గుర్తుంచుకోవాలి.

అంటే మనకు వర్తించదా? అని ప్రశ్నిస్తారు. ఎందుకు వర్తించదు? వర్తిస్తుంది. కాని ఇక్కడ విషయమేమంటే యూదులు వెయ్యేండ్ల పరిపాలన కొరకే ఎదురు చూశారు. నిత్యజీవము కొరకు కాదు. కనుక యాకోబు వెయ్యేండ్ల పరిపాలన గురించి ఇక్కడ ప్రస్తావించాడు.

మంచి క్రియలు లేని క్రైస్తవులు (విశ్వాసులు) ఏ విధమైన తీర్పు పొందుతారో సోమరియైన చెడ్డ దాసునితో పోల్చి మత్త. 25:23-30లో చూపించారు. పౌలు తన విశ్వాస జీవితమును జయకరంగా ముగించినట్లు 2తిమో. 4:7లో వ్రాస్తూ 'ప్రభువు ప్రతి దుష్కార్యము నుండి తనను రక్షించి పరలోక రాజ్యమునకు తను చేరునట్లు రక్షించునుగాక అని 2తిమో. 4:18లో పూర్తి చేస్తాడు.

కనుక క్రొత్త నిబంధన ప్రకారము రెండు విధములైన సంగతులు విశ్వాసికి సంభవిస్తాయి.

**1) నిత్యజీవము** – ఉచితముగా (దానముగా) పొందేది : 'కాబట్టి నమ్మువాడు ఆయన కృపచేతనే, క్రీస్తునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులనుగా తీర్చబడుట' (రోమా 3:24). కాబట్టి మనము క్రియలనుబట్టి కాక మన విశ్వాసమునుబట్టియే మనలను దేవుడు తన మహాకృపలో నీతిమంతులుగా తీర్చుచున్నాడు (రోమా 3:26-28, 4:5,6). దేవునిచేత నీతిమంతులుగా తీర్చబడిన మనము ఎన్నటికి నిత్యజీవమును పోగొట్టుకొనము (రోమా 8:30-34). క్రీస్తులో మనకు నూతన జీవనము కలిగినది. నూతన స్థితిలో ప్రవేశించాము (యోహాను 5:24, రోమా 4:25, 5:18).

**2) పరలోకరాజ్యము** – ప్రతిఫలముగా పొందేది : ఇది క్రియల వలన పొందే ప్రతిఫలము. క్రీస్తు న్యాయపీఠము ఎదుట ఎవని క్రియలకు తగినట్లుగా పొందే తీర్పు (యాకోబు 2:21-24). మంచివిగాని చెడ్డవిగాని తగినట్లుగా ఫలము పొందుతాము (1కొరింథీ. 3:12-14, 4:4,5, 2కొరింథీ. 5:10, 1పేతు. 1:1).

క్రియలనుబట్టి ఒకవేళ మనము మంచి బహుమానం పొందక పోవచ్చును (1కొరింథీ. 2:27) మంచి బహుమానము పొందనూ వచ్చును (యాకోబు 1:12). విశ్వాసము ద్వారా నిత్యజీవము, క్రియల ద్వారా పరలోక రాజ్యములో ఫలములు పొందుతాము.

పరుగు పందెములో తాను గెలిచినట్లుగా బహుమానంగా జీవకిరీటమును పొందగలడని పౌలు భక్తునికి దేవుడు తన అవసాన కాలమందు తెలియజేశాడు (2తిమో. 4:7,8). అయితే పౌలుకి నిత్యజీవ ప్రవేశానికి ఎప్పుడూ అనుమానము లేదు. ఇప్పుడు చనిపోతే ప్రభువుతో వుంటాను అన్నాడు. అంటే నిత్యజీవములో వుంటాడని అర్థం.

ఇప్పుడు పాఠకులందరికి ఉచితముగా పొందే **బహుమానము,** క్రియలకు తగినట్లుగా పొందే **ప్రతిఫలమును** గూర్చి అర్థమయింది. కనుక ఈ విషయాలు చదివేటప్పుడు ఎక్కడ ఏది అవసరమో దానిని అన్వయించుకోవాలి. పదాలు అన్వర్తించుకొనేటప్పుడు దేవుడు ప్రేమా స్వరూపి అని మాత్రం గుర్తుంచుకోండి. అంతమాత్రంచేత శిక్ష తప్పించుకోరు. శిక్ష భయంకరంగానే ఉంటుంది కాని శాశ్వతమైనది మాత్రం కాదు. తన కుమారునియందు జగత్తు పునాది వేయబడక ముందే మనలను శాశ్వత జీవము కొరకు నిర్ధారించిన ప్రేమగల దేవుడు మన అతిక్రమములనుబట్టి శిక్షిస్తాడుగాని మనలను పోగొట్టుకొనడు (సామె. 19:18, కీర్త. 89:30-34, ఎఫెసీ. 1:3-5, రోమా 8:29,39). ఈ వచన భాగాలలో ఏవీ మనం నిత్యజీవాన్ని పోగొట్టుకుంటామని తెలియజేయటం లేదు. ఎందుకంటే నిత్యజీవము పోకుండా చేసే ఆ నిత్య శిక్షను యేసు సిలువలో మన పక్షముగా భరించాడు. వెయ్యేండ్ల పరిపాలనలో ఉండే శిక్ష భయంకరంగానే ఉండవచ్చునుగాని శాశ్వతం కాదు (1కొరింథీ. 5:1-5,11:29-32, లూకా 12:41-45). ఎందుకంటే వెయ్యేండ్ల పరిపాలనే శాశ్వతమైనది కాదు. నిత్యజీవములో మరణమైనను, దుఃఖమైనను, వేదనయైనను ఇక వుండదు. మొదటి సంగతులు గతించెను (ప్రక. 21:4). మొదటి సంగతులు అంటే మొదట సంభవించేవి. వెయ్యేండ్ల పరిపాలన అయిపోయిందని అర్థం. ఇప్పుడు సంభవించేవి అంటే నిత్యజీవములో సంభవించేవి. ఆశ్చర్యకరమైన ప్రేమ యొక్క దయ, కృపామయమైన సంగతులు క్రీస్తు స్వరూపములోనికి రూపాంతరము పొందుటకు అవసరమైన శిక్షణ కార్యక్రమ పనులు పూర్తి అయినవి. ఇక శాపము లేదు. ఆయన పేరు మన నొసటి మీద ముద్రింపబడి వుంటుంది. ఆయన వెలుగులో ఆయనను సేవిస్తూ యుగయుగములు ఆయనతో పరిపాలిస్తూ వుంటాము. దేవునికి స్తోత్రము హల్లెలూయా! (ప్రక. 22:3-5). **(సశేషం)**

# క్రైస్తవ జీవిత దృక్కోణం

రాజుగారి వక్రబుద్దులు, అత్యాశలు, పాపముతో కూడుకున్న ఆశలను ఆ సాతాను ముందు వుంచుతాడు. అప్పుడు అది రాజుగారి కోసం అతను అడిగిన ప్రతీది చేసిపెడతాడు. చివరకు తన జీవిత చరమాంకంలో రాజుగారు తన ఆత్మ సాతానుకు అర్పించు సందర్భంలో విలవిలలాడి పోతాడు. ఇక ఆ సాతాను అతని ఆత్మను స్వాదీనం చేసుకొని చిత్రహింసలు పెట్టడం మొదలు పెడుతుంది. అప్పుడు ఆ రాజుగారు నేను భూమి మీద మాత్రమే జీవితం అనుకున్న కాని చనిపోయిన తరువాత అసలు జీవితం వుంది. తెలియక నేను ఈ సాతాను ఒప్పందానికి ఒప్పుకున్న. ఇప్పుడు నన్ను రక్షించేవారు ఎవరు అని ప్రతి దినము శోకించటం మొదలుపెట్టాడు.

చూశారా! మనకు తెలియని విషయాలు ఎన్నో వున్నాయి. నిజం, మన అసలు జీవితం మరణించిన తరువాతే మొదలవుతుంది. ఈ విషయాన్ని అన్ని వేదాలు, మత గ్రంథములు ఏక కంఠముతో చెబుతున్నాయి. నువ్వు అనుకోవచ్చు ఈ బాధలు చనిపోయిన తరువాత వుండవు అని , కాని యేసు లేకుండా చనిపోయినట్లయితే నీ జీవితం అంధకారం. ఇలాంటి సందర్భంలోనే యేసు ఒక ఉపమానము చెప్పాడు. అది ధనవంతుడు, బీదవాడైన లాజరు. వీరి ఇరువురి ఆర్థిక, సామాజిక, ఆరోగ్య స్థితులు భూమి ఎంతో వ్యత్యాసంగా ఉన్నప్పటికి పరలోకంలో వాటిని బట్టి దేవుడు వాళ్ళకు తీర్పు తీర్చలేదు. డబ్బు బట్టి తీర్పు తీర్చలేదు. ఆరోగ్యమును బట్టితీర్పు తీర్చలేదు కాని తమ ఇష్టం వచ్చినట్లు జీవించిన జీవితం గూర్చి మాత్రమే తీర్పుతీర్చాడు. ఈ లోకంలో కష్టపడు, సంపాదించు, కాని నీ జీవితాన్ని మాత్రము నీకు ఇష్టం వచ్చినట్లు జీవించ వద్దు. అలా ధనవంతుడు చేసి చివరకు నరకానికి పాత్రుడైనాడు. నీవు కూడా అలాగే ఇష్టం వచ్చినట్లు జీవించినట్లయితే ప్రియ దేవుని బిడ్డ నీ జీవితాన్ని పాడు చేసుకున్నట్లే. బైబిల్ చెప్పేది సత్యం అని నమ్మండి. మనం ఈ లోకంలో బహు కొద్దికాలమే జీవిస్తాము అని జ్ఞాపకం చేసుకోండి. ఈ కొద్దికాలం మీరు దేవునికి సమర్పించుకొని నీతిమంతులుగా ఈ లోకంలో జీవించగలిగితే పరలోకంలో నీకు సుస్థిరస్థానం వుంటుంది. లేకపోతే బైబిల్‌లో ఉన్న ధనవంతుని మాదిరిగా నీ ఆత్మ నిత్యమైన అగ్నిగుండంలో యాతన అనుభవించాల్సి వుంటుంది. కాబట్టి మీరు మీ జీవితాన్ని లేక బ్రతుకును డబ్బు సంపాదనతో ముడిపెట్టక ఈ స్త్రీ చేసిన విధంగా చేయండి.

**స్త్రీ దృష్టి కోణము:-**

ఇదే సన్నివేశం బైబిల్‌లో మరోచోట వ్రాయబడియున్నది. యోహను : 12:1-10 ఇక్కడ చూసినట్లైతే మనకు ఆ స్త్రీ యొక్క దృష్టికోణము మనకు అర్థం అవుతుంది. ఆమె మానవత్వం గురించి కొంచెంసేపు ఆలోచిద్దాం. మొదటగా ఆమె ప్రభువు చేసిన మేలు గుర్తించింది. కాని నేటి మానవులు తమను తాము తీర్పు తీర్చుకుంటున్నారు. వారే భూమి మీద అత్యంత మంచివారు అని ఇతరులు తమపట్ల ఎన్నో దోషాలు, పాపాలు చేశారని, అందునుబట్టి వారిని మేము దూరంగా ఉంచుతున్నామని వారు తలంచుకున్నారు. కాని వారి ఆలోచనలు తప్పు. ఒకవేళ నీవు కూడా మంచి వాడవని, గొప్పవాడవని తలుస్తువున్నావా? దయచేసి ఆ ఊహను మీ మనస్సులో నుండి తీసివేయండి. ఎందుకంటే దేవుడే చెబుతున్నాడు.

**రోమా : 3:23** "ఏ భేదము లేదు, అందరును పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొనిదలేకపోతున్నారు."

చూశారా! మనమందరము పాపులము. మన ఆలోచనలు మన ఉద్దేశాలు కేవలం స్వార్థపూరితంగా వుంటాయి. చూడండి పిల్లలు పుట్టుకతోనే ద్వేషము,

అసూయలతో పుడతారు. వారికి మంచి మార్గం బోధించాలి అంటే వారికి ఖచ్చితంగా గురువు అవసరం. చెడ్డమార్గం నేర్పించాలి అంటే గురువు అవసరంలేదు. వాడు స్వతహాగా చెడిపోతాడు. నాకు అనుభవమైన ఒక సందర్భం మీతో పంచుకుంటాను. మా ఇంటిలో మొదటిగా పుట్టిన వాడిని ఎత్తుకొని ఎంతో ముద్దుచేసివాడిని. ఒక సంవత్సరం తరువాత రెండవ వాడు పుట్టినప్పుడు మొదటివాడు కొంచెం జ్ఞానంలోకి వచ్చాడు కదా అని నేను మొదటివాడిని ఎత్తుకోకుండా రెండవ వాడిని దగ్గరకు తీస్తువుంటే మొదటివాడు ఎంతో అసూయపడి వాడిని నా దగ్గర నుండి తోసివేయటం నేను గమనించి చాలా ఆశ్చర్యపోయాను. ఏవరు చెప్పారు వీడికి ఇలా అసూయపడమని? ఎవరు చెప్పారు వీడికి ఇలా ద్వేషించమని? మానవునికి ఇది స్వతహగా వచ్చేగుణం. ఎవరైన ఎదుగుతూ వుంటే ఓర్వలేని తత్వం. తను నష్టపోయిన సరే ఎదుటివాడిని లాగివేయాలని ఎంతో శ్రమిస్తారు. ఎదుటివాడు నాశనమైతే తప్ప వారు విజయం సాధించినట్లు అనుకోరు. అందుకే దావీదు మహరాజు ఇలా అంటాడు. "నా తల్లి నన్ను పాపంలో గర్భం దాల్చినది". అవును మన పుట్టుక పాపము మన పెంపకం పాపం. కాబట్టి నువ్వు నేను గుర్తించవలసిన అతి ప్రాముఖ్యమైన విషయం మనం పాపులము. ఈ విషయం ఆ స్త్రీ గుర్తించింది.

ఈ పాపానికి పరిహారం చెల్లించాలి అని ఆమె తలంచి ఒక గొప్ప కార్యం ఇక్కడ చేస్తుంది. అది యేసు పాదాల దగ్గర తన జీవితాన్ని ప్రోక్షించినది. అనగా యేసు మాత్రమే తన పాపాలను తన శాపాలను తీసివేయగలవాడు అని గుర్తించింది. ఆమెలో వున్న మరో అత్యున్నతమైన లక్షణం పాపాలను పరిహరించే వారు ఎవరో గుర్తించటం. ఈ రోజులలో ఎంతోమంది పాపాలు పరిహరించే వారు ఎవరో తెలియక ఎక్కడెక్కడికో పరుగుతీస్తున్నారు. కొండలకు, అడవులకు, విదేశాలకు లేదా నదులకు పరుగు తీస్తువుంటారు.

కాని భూమి మీద ఏవరు నీకు పాపపరిహారము ఇవ్వలేరు లేదా పాపము నుండి మిమ్ములను విడిపించలేరు. కాబట్టి మీ ప్రయాస భూమి మీద వ్యర్థం. మనం ఆచరిస్తున్న ఆచారాలు, పాటిస్తున్న అలవాట్లు నిన్ను మంచివాడిగా చేయలేవు. యేసు దేవుడు మాత్రమే, ఆయన రక్తము మాత్రమే మనలను నీతిమంతులుగా తీరుస్తుంది. కాబట్టి ఆ స్త్రీ యేసు పాదాల దగ్గర దీనమనస్సు కలిగి తన కురులతో ఆయన పాదాలు తుడిచింది. మనం కూడా ఇలాంటి స్వభావాన్ని కలిగివుండాలి. దీన మనస్సును ధరించుకొని యేసు పాదాల చెంతకు వచ్చి తమ జీవితాలను సమర్పించి నప్పుడు ఆయన మనలను ఆశీర్వదిస్తాడు.

**యెషయా : 57:15** "ఆయన వినయము గల వారి ప్రాణమును ఉజ్జీవింపజేసెను."

నీవు కూడా ఈ స్త్రీ లాగే తెలివిగా ఈ లోకంలో ప్రవర్తించినట్లయితే నీ జీవితాన్ని దేవునికి సమర్పించి ఆయన ముందు దీనమనస్సు కలిగి జీవించినట్లయితే ప్రియదేవుని బిడ్డ ఆయన నిన్ను తన కుమారుడిగా స్వీకరించి తన రాజ్యంలో నీకు స్థానం ప్రసాదిస్తాడు. ఆయన సమస్తం నెరవేర్చుటకు సమర్ధుడు. ఆయన అన్నిటిని చేయగల శక్తిమంతుడు. యేసును విశ్వసించండి. ఆయన చెంతకు రండి. అప్పుడు మీ బ్రతుకును మార్చి నూతనపరుస్తాడు.

**దేవుని దృష్టికోణం:-**

మన జీవితాలను తయారుచేసింది నడిపిస్తుంది దేవుడే. కాబట్టి మనం ఎంత విలువైన వారమో ఆయనకు బాగా తెలుసు. ఉదాహరణకు ఒక ఇల్లు కట్టేవాడు ఏ గోడలో ఎటువంటి ఇటుకను అమర్చాడో అతనికే స్పష్టంగా తెలుసు. ఇతరులకు మరెవ్వరికి ఈ విషయం తెలియదు. అలాగే ఆయన చేతులతో నిర్మించబడిన మనం, మన జీవితం అంతా దేవునికి చాలా స్పష్టంగా తెలుసు. అందును బట్టి ఆయన పరలోకమును విడిచి నిన్ను రక్షించటానికి మానవుని రూపాన్ని ధరించుకొని ఈ లోకంలోకి అడుగు పెట్టాడు. ఆయన మనలను చేసినప్పుడు ఆయన స్వరూపం లో ఆయన పోలికలో చేయబడ్డాము కాబట్టి ఆయనకు మనమంటే ఎంతో ఇష్టం. **మిగితాది 19వ పేజీలో**

స్త్రీల విభాగము

# రూతు



శ్రీమతి కె. రేచల్ జోసఫ్,
హన్నా ఉమెన్స్ ప్రెసిడెంట్

రూతు గ్రంథం మొదటి అధ్యాయం మొదటి వచనంలో "న్యాయాధిపతులు" యేలిన దినముల యందు దేశములో కరవు కలిగినట్టు కనబడుతుంది. అప్పుడే ఆ సమయంలోనే ఎలీమెలెకు అను ఒక మనుష్యుడు యూదా బెత్లేహేము నుండి తన భార్య అయిన నయోమి తన ఇద్దరు కుమారులైన మహ్లోను, కిల్యోను అను వారిని తీసుకొని మోయాబు దేశంలో కాపురం ఉండడానికి వెళ్ళాడు. (రూతు 1:1)

మోయాబు వాసులు విగ్రహారాధికులు, శాపగ్రస్తులు కూడా! "లోతు" కుమార్తెలు తమ తండ్రి ద్వారా కనిన అక్రమ సంతానమైన "మోయాబు", "బెన్నమ్మి" అనువారి వంశస్తులు. వీరు – అక్రమ సంతానమైనారు గనుక వీరు శాపగ్రస్తులైనారు.

"అమ్మోనీయుడే గాని, మోయాబీయుడే గాని యెహోవా సమాజములో చేరకూడదు" (ద్వితీయ 23:3, నెహెమ్యా 13:1)

ఫలప్రదమైన యూదా బెత్లేహేములో తాత్కాలికం గా కరవు కలుగగానే "రొట్టెల ఇల్లు"గా ఆశీర్వదింపబడిన బెత్లేహేమునుండి ఎలీమెలెకు కుటుంబం శాపగ్రస్తమైన మోయాబు దేశానికి వలస వెళ్ళిపోయారు. శాపగ్రస్తమైన దేశంలో శాపం తగిలిందో ఏమో ఎలీమెలెకు చనిపోయాడు. తరువాత నయోమి తన కుమారులిద్దరికీ మోయాబు స్త్రీలను వివాహం చేసింది. ఇక ఇప్పుడు కూడా మరల శాపం తగిలినట్టే కుమారులిద్దరూ చనిపోయారు. ఇక నయోమి తన ఇద్దరు కోడళ్ళు 'ఓర్పా', 'రూతు' ముగ్గురు విధవరాండ్రుగా మిగిలిపోయారు.

వారికి ఆహార మిచ్చుటకు యెహోవా తన జనులను దర్శించెనని (1:8) నయోమి విని బెత్లేహేముకు ప్రయాణ మైంది. తన కోడళ్ళు ఓర్పా, రూతు కూడా ఆమెతో బయలు దేరారు. నయోమి కొంత ఆలోచించిందేమో దారిలోనే వాళ్ళిద్దరిని చూచి "మీరు మీ తల్లుల ఇండ్లకు తిరిగి వెళ్ళండి" అని చెప్పింది. కొంతసేపు చెప్పిన తరువాత 'ఓర్పా' మనసు మార్చుకొని తిరిగి వెనక్కి వెళ్ళిపోయింది.

కాని రూతు మాత్రం ముసలితనంలో ఒంటరిగా ఉన్న తన అత్తను అలా వదిలి వెళ్ళడానికి ఎంతమాత్రమూ ఇష్టపడలేదు. అది తన బాధ్యతగా ఎంచింది. తన దేశాన్ని, తన వారినీ వదిలి మరొక దేశానికి వెళ్ళిపోవడం సులభమైన సంగతేం కాదు. యవ్వనస్తురాలైన రూతు మళ్ళీ పెండ్లి చేసుకొని సుఖమైన జీవితాన్ని జీవించవచ్చు. అయినా అదెంత కష్టమైనా, బాధైనా, అవమానమైనా, దుఃఖమైనా అత్తను వదలడానికి మాత్రం ఆమె ఇష్టపడలేదు.

"నా వెంబడి రావద్దనియు, నన్ను విడిచిపెట్టు మనియు నన్ను బతిమాలుకొనవద్దు, నీవు వెళ్ళు చోటికే నేను వచ్చెదను. నీవు నివశించు చోటనే నివసించెదను. నీ జనమే నా జనము, నీ దేవుడే నా దేవుడు. నీవు మృతి పొందుచోటనే మృతి పొందెదను. అక్కడనే పాతిపెట్టబడెదను. మరణము తప్ప మరి ఏదైనను నిన్ను, నన్ను ప్రత్యేకించిన యెడల యెహోవా నాకు ఎంత కీడైనను చేయును గాక" అని రూతు అనెను. (రూతు 1:16)

రూతు మాట్లాడిన ఈ మాటలు ప్రతి ఒక్కటీ ఆమె ఎంత ధృడనిశ్చయం తీసుకుందో, ఎంత గట్టి తీర్మానం తీసుకుందో తెలుస్తుంది. అంతేకాదు తన బాధ్యత ఎంత బాగా గుర్తించిందో కూడా తెలుస్తుంది. తన అత్తను ఎంత బాగా ప్రేమించిందో కూడా అర్థం అవుతుంది. నయోమిపై రూతుకున్న గౌరవాభిమానాలు చూస్తుంటే ఆశ్చర్యం కలుగు తుంది. అత్తా కోడళ్ళమధ్య గల సంబంధ బాంధవ్యాలను గూర్చి – ఉన్నవాటికి మరెన్నో లేనివాటిని కల్పించి చెప్పుకో వడం మన సమాజంలో బాగా అలవాటే! కాని రూతు తన అత్తను ప్రేమించడంలో తన ప్రత్యేకతను నిరూపించుకుంది. ఆ ప్రత్యేక ప్రేమను గూర్చి ఆ క్రొత్త దేశంలో కథలు కల్పించ లేదు గాని ప్రజలందరు ఎంతో బాగా చెప్పుకున్నారు. అందుకే బోయజు దగ్గరకు వెళ్ళినప్పుడు "నీవు నీ అత్తకు చేసిన

దంతయు నాకు తెలియబడెను" (2:10) అని అన్నాడు.

రూతు ఓబెదును కనినపుడు కూడ అక్కడ స్త్రీలందరు నిన్ను ప్రేమించి ఏడుగురు కుమారుల కంటే ఎక్కువగానున్న నీ కోడలు ఇతని కనెను (4:15) అంటూ ప్రశంసించారు. కథలు చెప్పుకునే రీతిగా ఉన్న అత్తాకోడళ్ళ గురించి ఎంతో నేర్చుకోవలసి ఉంది కదా!

తను సంపాదించి అత్తను పోషించాలనే బాధ్యత ను గుర్తెరిగి ఆమెకు లోబడి "నీ సెలవైన యెడల నేను పొలము లోనికి పోయి" (2:2) అంటూ ఆమె సెలవుతోనే పరిగె ఏరుకోవడానికి వెళ్ళింది. ఆమె చెప్పిన స్థలంలోనే స్థిరంగా నిలబడింది. బోయజు ఆమెను ఎంతో ఆదరించి, దయచూపి, తనతో కూడ భోజనానికి ఆహ్వానించి పేలాలు అందియ్యగా తాను తిని కొన్ని తన అత్తకొరకు మిగిల్చి తీసుకొని వెళ్ళి యిచ్చింది. ఆమె అతని వలన దయ పొందెనని గ్రహించి, "నా కుమారీ! నీకు మేలు కలుగునట్లు, నీకు విశ్రాంతి విచారింపవలసిన దానను కదా"(3:1) అంటూ తన బాధ్యతను గుర్తుచేసుకొని ఎంతో ప్రేమతో చేయవలసిన క్రమము ఆమెకు నేర్పించి పంపించింది. రూతు నయోమి చెప్పినట్లుగానే చేసి గొప్ప దీవెనలను పొందగలిగింది. బెత్లేహేములో రూతుకు చాల క్రొత్త ప్రదేశం, ప్రజలు క్రొత్తవారు, పద్ధతులు క్రొత్త, అలవాట్లు కొత్తవి, సొంతవారు లేరు, ఒంటరిగా బాధ్యతలు మీద పెట్టుకుంది. ఉన్న ఊర్లోనే మరొక కుటుంబంతో కలిసి జీవించవలసివస్తే ఎన్నో విషయాలు సరిచేసుకోవలసి వస్తుంది. అయినా అత్తను ప్రేమించి, బాధ్యతను స్వీకరించి ధైర్యంగా బయలుదేరింది. బాగా భయభక్తులు పెంచుకుంది. అందుకే నయోమితో మాట్లాడిన మాటలలో "నీ దేవుడే నా దేవుడు" అని ధృడంగా చెప్పగలిగింది. ఆయనయందు విశ్వాసంతో ధైర్యంగా ముందుకు సాగింది. ఆ భయభక్తులే ఆమెకు అన్నింటా దీవెనలు అందించగలిగాయి.

నయోమి సెలవుతో పరిగె యేరుకొనుటకు వెళ్ళిన రూతును దేవుడు సరియైన మనుష్యునియొద్దకు పంపించాడు. అతడు ఎలీమెలెకు వంశస్థుడైన "బోయజు". పరిగె ఏరుకొనుటకు కొత్తగా వచ్చిన రూతునుగూర్చి విచారించి తెలుసుకొని ఆమెయెడల దయకలిగి పరిగె యేరుకొనుటకు సెలవు యివ్వడం మాత్రమే గాక మరొక చోటికి వెళ్ళవద్దని కూడా చెప్పాడు. "యెహోవా రెక్కల క్రింద సురక్షితముగా నుండునట్లు నీవు వచ్చితివి. ఆయన నీకు పూర్ణమైన బహుమానమిచ్చును" అని (2:10-12) ఆమెను దీవించాడు. అంతేకాదు అతనితో కూడ భోజనము చేయుటకు ఆమెను ఆహ్వానించాడు. అతడు ఆమెకు పేలాలు అందియ్యగా కొన్ని తిని తృప్తి పొంది కొన్ని మిగిల్చి తన అత్తయొద్దకు తీసుకొని వెళ్ళి ఆమెకు ఇచ్చి అతడు ఆమెయెడల ఎంత దయచూపించాడో ఆమెకు వివరించినపుడు అతడు ఆమెను విడిపింప గలవారిలో ఒకడని తెలుసుకొని ఆమె చేయవలసిన క్రమము ఆమెకు నేర్పించి పంపించింది. నయోమి మాట ప్రకారము రూతు బోయజు దగ్గరకు వెళ్ళి 'నీవు నాకు సమీపబంధువు గనుక నీ దాసురాలి మీద నీ కొంగు కప్పుము అనగా 'యెహోవా చేత దీవెననొందిన దానవు. నీ మునుపటి సత్ప్రవర్తన కంటే వెనుకటి సత్ప్రవర్తన మరియెక్కువైనది' అని ఆమెను గూర్చి అన్నాడు. నీవు యోగ్యురాలవని జనులందరు ఎరుగుదురు' అని చెప్పడంలో ఆమె మంచితనం బాగా గ్రహింపు అవుతుంది.

మరునాడు పురజనులందరి యెదుట రూతును బోయజు పెండ్లి చేసుకున్నాడు. ఆమె గర్భవతియై కుమారునికి జన్మనిచ్చింది. అతనికి ఓబేదు అని పేరు పెట్టారు. అతడు దావీదుకు తండ్రియైన యెష్షయికి తండ్రి. దావీదు వంశావళి లో యేసుక్రీస్తు పుట్టాడు. రూతు యేసు ప్రభువు వంశావళిలో ఉండడం ఎంత గొప్ప భాగ్యం! ఎంత గొప్ప ఆశీర్వాదం!

రూతు విగ్రహారాధికులైన శాపగ్రస్తుల దేశమునుండి వచ్చింది. అయినా ఆమె తన అత్తను ఎంతో ప్రేమించి, ఆమె బాధ్యతను వహించి నిజదేవుని యందు భయభక్తులు కలిగి విశ్వాసంతో యూదా బెత్లేహేములోకి అడుగుపెట్టింది. వినయముతో విధేయతతో తన అత్తకు లోబడడం మాత్రమే గాక యజమానుని యెడల కూడ వినయ విధేయతలు, గౌరవాభిమానాలు చూపించింది.

ఆమె నిష్కల్మషమైన ప్రేమ ఆమెను ఉన్నత స్థానానికి తీసుకొని వెళ్ళింది. ఆమెకు దేవుని యెడలవున్న భయభక్తులు, విశ్వాసము ఆమెకు ఎన్నో ఆశీర్వాదాలను తెచ్చిపెట్టింది. మంచితనమూ, వినయమూ, విధేయతా కలిగిన ఆమె వ్యక్తిత్వముతో ఎన్నో దీవెనలను పొందగలిగింది. ఎంతో ఆదరణ, దయ, ప్రోత్సాహము చూపించి ఆధారంగా నిలిచిన బోయజు తనకు భర్తగా లభించడం గొప్ప ఆశీర్వాదం. ఆమెను ప్రేమించి పెండ్లి చేసుకొన్నాడు, రూతు ఓబేదు అను ఒక కుమారుని కని, రక్షకుడైన యేసుక్రీస్తు వంశావళిలోనికి చేర్చబడింది.

మనము పాపంచేసినా శాపగ్రస్తులమైనా రూతు వంటి మంచి గుణగణాలను అలవర్చుకొని అలాంటి స్వభావాన్ని ధరించుకొని క్రీస్తురక్తములో కడుగబడి ఆయన కుమారులుగా, కుమార్తెలుగా ఆయన వంశంలో చేర్చబడు దుము గాక!

వాక్యంలోని వనిత - రూతును అనుసరించుటకు పరిశుద్ధాత్మ దేవుడు మనందరికి సహాయము చేయును గాక!

13



బ్రదర్ కె.సామ్రాట్

# మదర్‌తెరీసా

పేదవాళ్ళ ఔదార్యం గురించి మదర్ తెరీసా నిర్మల్ హృదయ్‌లో తెలుసుకున్నారు. పడకలన్నీ నిండుగా వుండి, క్రొత్తగా తీసుకొచ్చిన వారికి కాస్త కోలుకున్న వాళ్ళు వారి పడకను ఇచ్చి వారి ఔదార్యాన్ని చూపించేవారు. ఎంత బాధలో కూడా ఎవరినీ నిందించకుండా, వారికి దొరికిన భాగ్యానికి మదర్‌కు కృతజ్ఞతలు చెల్లించేవారు. ఆ విధంగా ప్రభువు మహిమపరచబడినట్లు మనము చూడగలము. మదర్ తెరీసా దయగల హస్తం వారిని తాకితే మరణ తలుపు దగ్గర వున్న వారికి ఉపశమనం కలిగేది. దేవుడు మీ బాధను చూస్తున్నాడు. మిమ్మల్ని ప్రేమిస్తున్నాడు భయపడవద్దు అని వారికి ఆదరణ మాటలు చెప్పేవారు. భగవంతుని కలుసు కునే ముందు వారికి సమాధానము కలుగజేయబడి, వాళ్ళంతా నిత్యజీవములోకి వెళతారని అక్కడ పరిచర్య చూడటానికి వచ్చే వాళ్ళు అనుకునేవారు.

ఈ ధర్మశాస్త్ర గ్రంథమును నీవు బోధింపక తప్పిపో కూడదు. దానిలో వ్రాయబడిన వాటన్నిటి ప్రకారం చేయు టకు నీవు జాగ్రత్తపడునట్లు దివారాత్రము దాని ధ్యానించిన యెడల నీ మార్గమును వర్ధిల్లజేసికొని చక్కగా ప్రవర్తించెదవు (యెహోషువ 1:8). మదర్ తెరీసా ఈ వాక్యాన్ని తన హృదయమందు భద్రపరచుకొని ఆ ప్రకారము తన వద్ద చేరిన సిస్టర్స్‌కు బైబిలు వాక్యము బోధించేవారు. నాలుగు సువార్తలలోని యేసుప్రభువు జీవితము, ఆయన బోధలు వారికి వివరించేవారు. ఆధ్యాత్మిక శిక్షణ కొరకు ఫాదర్ హెన్రీ, ఫాదర్ వాన్‌ఎగ్జిమ్ ఎంతో సహాయపడేవారు. మార్చి 1953లో మదర్ తెరీసాతో మొట్టమొదటిగా చేరిన నలుగురు సిస్టర్స్ మిషనరీస్ ఆఫ్ ఛారిటీ సంస్థలో సంపూర్ణ సేవ చేస్తామని వాగ్దానాలు చేయడానికి ప్రత్యేక ప్రార్థన సమావేశం జరిగింది. ఆనాడు ఆ నలుగురు సిస్టర్స్‌తోపాటు మదర్ తెరీసా కూడా వాగ్దానాలు చేశారు. సువార్త పఠనము, వాక్యపరిచర్య, ఆరాధన జరిగిన తరువాత ఆ అయిదు గురును ప్రమాణము చేయుటకై ఫాదర్‌గారు పిలిచారు. ప్రభువా నీవు నన్ను పిలిచావు అని జవాబిచ్చి ముందు నిలిచారు. అప్పుడు ఫాదర్ నా ప్రియమైన సహోదరీ, నీవు దేవుణ్ణి, ఆయన సంఘాన్ని ఏమి కోరుకుంటున్నావు అని అడిగాడు. నేను నా ప్రభువును, సంఘానికి, నాకు భర్తయైయున్న క్రీస్తును వెంబడించి నా జీవితకాలమంతా చనిపోయేవరకు ఈ మతసంస్థలో కష్టించి పనిచేయుటకు ప్రమాణము చేయుచున్నాను అని చెప్పారు. అంతట ఫాదర్ వారికి ఇలా బోధించారు. మీరు బాప్తిస్మంతో క్రీస్తు వారయ్యారు. మీరు ఎంచుకున్న పని అతి పరిశుద్ధమైనది. కనుక మీరు క్రీస్తుతో ఇంకా గట్టిగా బంధించబడియున్నారు. మీ శరీరము, మనసు, ఆత్మ దేవునికే అర్పితమైనాయి. మీ అయిదుగురు దేవుని సొత్తు కనుక మీరు ఏమి ఆలోచించినా, కోరినా అదంతా ప్రభువు మహిమార్థమే అని చెప్పాడు. వారి అంగీకారాన్ని అడిగి తెలుసుకున్నాడు. ప్రియ సహోదరీ, నీకు అప్పగింపబడిన నిరంతర దేవుని పనిలో క్రీస్తు ప్రభువుతో గట్టి బంధాన్ని కలిగి వుండడానికి అంగీకరి స్తున్నావా? దేవుని కృపతో, దేవుని సహాయంతో ప్రభువైన క్రీస్తును అనుసరించుటకు ఆయన చూపిన మార్గాన వెళ్ళుటకు అంగీకరిస్తున్నావా? అని అడిగారు. అంగీకరిస్తు న్నానని జవాబిచ్చారు. పరిశుద్ధాత్మ కృపతో నీకివ్వబడిన పేదల సేవ జీవితమంతా చేస్తానని అంగీకరిస్తున్నావా? అంగీకరిస్తున్నాను. ఈ మిషనరీస్ ఆఫ్ ఛారిటీ నియమావళి ప్రకారము, సువార్తలలో ప్రభువు చెప్పిన ప్రకారము నిరంతరము నీ దేవుని సేవిస్తూ, నీ పొరుగు వారిని ప్రేమించి సహాయం చేస్తానని వాగ్దానము చేయుటకు అంగీకరిస్తు న్నావా? అంగీకరిస్తున్నాను. అప్పుడు సంఘమంతా నిలువబడి వారికి ఇవ్వబడిన దేవుని పిలుపునకు లోబడి

వారు వాగ్దానము చేసిన విధముగా కొనసాగుటకు తగిన విశ్వాసము దయచేయాలని దేవుని ప్రార్ధించారు. మిషనరీస్ ఆఫ్ ఛారిటీ నియమావళిలో పొందుపరచబడిన ప్రమాణాన్ని మదర్ తెరీసా ఈ విధంగా చదివింది. సిస్టర్ మేరీ తెరీసా అనబడు నేను పేదరికం, పరిశుద్ధత, విధేయత మరియు కడుబీదలైన వారికి ఉచితమైన, మనస్ఫూర్తితో చేయవలసిన సేవ చేస్తానని ప్రమాణం చేయుచున్నాను. పరిశుద్ధాత్మ శక్తితో ఈ మన సంస్థ నియమావళికి లోబడి కడుబీదలైన వారికి హృదయ పూర్వకంగా సేవచేస్తానని వాగ్ధానం చేస్తున్నాను. ఇదే విధంగా నలుగురు సిస్టర్స్ కూడా వాగ్ధానము చేశారు. అప్పుడు ఫాదర్ ఒక్కొక్క సిస్టర్‌తో నాకియ్యబడిన అధికారంతో మీరు చేసిన ప్రమాణాన్ని స్వీకరిస్తున్నారు. ప్రభువు చూపిన సిలువమార్గంలో మీ సేవ కొనసాగించుటకు దేవుడు సహాయము చేయును గాక. ఆ తరువాత అయిదుగురు సిస్టర్స్ క్రీస్తు బల్లలో పాల్గొనుటకు ముందుకు వచ్చారు. గలతీయులకు వ్రాసిన పత్రిక 2:20 వాక్య ప్రకారము నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడియున్నాను. ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు అనే పరిశుద్ధుడైన పౌలు చెప్పిన మాటల్ని పాటగా పాడుచుండగా అయిదుగురు సిస్టర్స్ ప్రభువు బల్లలో పాలుపొందియున్నారు. ఈ విధంగా మొదటి అయిదుగురు సిస్టర్లు ప్రమాణ స్వీకారోత్సవ ప్రార్ధన కూటము ముగిసినది. మదర్ తెరీసా దేవునికి కృతజ్ఞతలు చెల్లించెను.

ఆ తరువాత మదర్‌తెరీసాకు ఒక హాలును ప్రార్ధనా మందిరముగా ఏర్పాటు చేయబడింది. అందులో బెంచీలు, కుర్చీలు లేవు. అందరూ క్రిందనే మోకరించి ప్రార్ధనలో పాల్గొనేవారు. ఫాదర్ హెన్రీ ప్రతిరోజు ఉదయం ప్రార్ధన నడిపించేవారు. క్రొత్తగా చేరే అమ్మాయిలను యాస్పరెంట్‌గా చేర్చుకొనేవారు. ఆరునెలలు పేదలతో సేవా కార్యక్రమాల్లో పాల్గొనిన తరువాత వారిని పాస్ట్యులెంట్స్‌గా తీసుకొని ఆధ్యాత్మిక శిక్షణగా తరగతులు నిర్వర్తించేవారు. ఒక సంవత్సరం తరువాత వీనిని నోవిసెస్‌గా నియమించి గురు, ఆదివారాల్లో పేదల సేవ చేయించేవారు. మిగిలిన రోజుల్లో కఠినమైన ఆత్మీయ శిక్షణ తర్ఫీదులో ఉంచబడతారు. ఎవరైనా అశ్రద్ధగా, అవిధేయంగా వుంటే సరిచేసి దేవుని వాక్యప్రకారము వారిని ప్రోత్సహించి విధేయులుగా, దేవుని ప్రేమకు పాత్రులగు నట్లు మదర్ తెరీసా జాగ్రత్త వహించేవారు. అనేకమంది క్రైస్తవ విశ్వాస వీరుల సేవా కార్యక్రమాల్ని చెప్పి వారిని ఉత్తేజపరిచే వారు. ఫాదర్ హెన్రీగారికి దేవుడిచ్చిన వరము ఈ సిస్టర్స్‌ను తగిన రీతిలో శిక్షణనిచ్చే నైపుణ్యము. రెండవ సంవత్సరము ఈ నోవిసెస్ సిస్టర్స్ కూడా వాగ్దానాలు తీసుకున్న ప్రొఫెస్డ్ సిస్టర్స్‌తో పేదల సేవలో పాల్గొనేవారు. వీరంతా గురువారాల్లో పిక్నిక్‌కు కూడా వెళ్ళేవారు. లేకుంటే మదర్ హౌస్‌ను శుభ్రం చేసి బాగు చేసుకునేవారు. పాటలు నేర్చుకునేవారు.

పరిశుద్ధత పాటించవలసిన కర్తవ్యం ప్రతి ఒక్కరిపైన ఉన్నది. పరిశుద్ధతను దేవుని ద్వారా పొంది ఆచరిస్తూ మనము చేయు క్రియలన్ని దేవుని వైపే ఉండాలని మదర్ తెరీసా అంటారు. మనము ఎక్కడ ఉన్నా, ఏమి చేసినా, మన పొరుగువారికి సేవ చేయుట ద్వారా క్రీస్తు ప్రభువుకు సేవ చేసిన వారిమవుతామని తన సిస్టర్స్‌కు బోధించే వారు. డబ్బు ప్రభువు ప్రేమను వ్యాప్తి చేయడానికి ఉపయోగపడాలని, ప్రభువు ఆకలి, పట్టెడు మెతుకులు కొరకు కాదు గాని, ప్రేమానురాగాల కోసం ప్రభువు దాహార్తి గొనియున్నాడు. నీ వారితో నీవు నవ్వుతూ వుంటూ, బాధలో వున్న వారితో కొంత సమయం గడిపి, వారికి ఉపశమనం కలిగించే సహాయం చేయాలి. ఇవన్ని చిన్న పనులు కావచ్చుగాని అది దేవుని ప్రేమకు గట్టి పునాదులవుతాయి. మీరు ఎక్కడో మురికి వాడలకు వెళ్ళి అక్కడున్న పేదరికాన్ని రూపుమాపే ప్రయత్నం చేయనవసరం లేదు. నీ కుటుంబంలోనే ఎవరో ఒకరు ప్రేమించబడుట లేదనే భావనతో కుమిలిపోతున్న పేద వారుంటారు. అలాగే నీ పొరుగు వారు కూడా. వారికి మీ ప్రేమను పంచండి. పొరుగు వానిని ప్రేమించమని యేసు ప్రభువు చెప్పాడు. మీ పొరుగింట్లో ఎవరున్నారో మీకు తెలుసా? వారి పేరేమిటో, వారు చేసే పనేమిటో మీకు తెలుసా? మనం ఒకరికోసం ఒకరున్నాం. ఆ సంగతి మర్చిపోవడం వల్లనే ప్రపంచంలో ఇంత అశాంతి. కొత్తవారైతేనేమి, ఎదురు పడినపుడు పలకరింపుగా చిరునవ్వునైనా అందించలేమా? ప్రతి మనిషిలోను యేసయ్య ఉన్నాడు. యేసయ్య ఎదురుపడితే ముఖావంగా తప్పుకుని వెళ్ళగలమా? చిరునవ్వు ఒక ప్రేమ కానుక.

**(సశేషం)**

# దేవుడు - సిరి

**20**

యేసుప్రభువు ఫిలిప్పును పరీక్షించాలనుకున్నాడు. అతని విశ్వాసము ఎంత ఉన్నది? శిష్యులు అందరూ ధర్మశాస్త్రము తెలిసినవారే. యూదులందరు తమ పిల్లలను 5వ సంవత్సరము నుండి సమాజ మందిరమునకు పంపిస్తారు. అక్కడ వారు ధర్మశాస్త్రము అంటే ఆదికాండము నుండి ద్వితియోపదేశకాండము వరకు పన్నెండు సంవత్సరాల వయస్సు వచ్చే వరకు అంటే ఏడు సంవత్సరాలు కంఠత పెడతారు. అది వారి ప్రాథమిక విద్య. అప్పుడే ప్రవక్తల గ్రంధాలు కూడా చెబుతారు.

ఎలీషా దగ్గరకు తేబడిన ఇరవై రొట్టెలు వంద మందికి సరిపోతాయా? అని వారు అనగా మిగులుతాయి అని ప్రభువు చెప్పాడని ఎలీషా అంటున్నాడు. ఇప్పుడు ఈ ఆహారం పెట్టే అవసరం ప్రభువే పెట్టాడు. వారు ఆయనను అన్నం అడుగలేదు. అడవిలో భోజనము ఎవరు అడుగుతారు?

ఫిలిప్పును పరీక్షించుటకు ప్రభువు అతనిని అడిగాడు. ఇంతకు ముందు త్రాగే నీళ్ళను ద్రాక్షారసముగా మార్చాడు కానీ అయిదు రొట్టెలను అయిదు వేలమంది పురుషులకు, (స్త్రీలు పిల్లలు కాక) ఆహారం పంచి పెట్టి ఇంకా మిగిలించగలరా? మిగిలించటం అలా ఉన్నా అసలు అందరూ తలా కొంచెం కొంచెం తీసుకున్నా 200 దేనారములు చాలవనుకున్నాడు ఫిలిప్పు.

యేసుప్రభువు వెంట ఉన్న శిష్యులు ఇలా మాట్లాడుతున్నారు. యేసుప్రభువు దగ్గర శిష్యులుగా చేరినప్పుడు వీరు 'పార్ట్‌టైం' సేవకులు. ఇటు చేపలు పట్టుకొని అమ్ముకొనేవారు, అప్పుడప్పుడు ఆయనతో తిరిగే వారు. కానీ రాత్రంతా వీరు చేపల కొరకు కష్టపడినా చేపలు దొరకలేదు. ప్రభువు ఉదయాన్నే వారి దగ్గరకు వచ్చి వారి దోనెలో కూర్చుని వాక్యము బోధించి ఇక చేపలు పట్టమన్నారు. రాత్రంతా ఏమి దొరకలేదయ్యా! వలలు కడుక్కుంటుంటే నువ్వు చూస్తున్నావుగా! అని మనసులో అనుకున్నా నీ మాట ప్రకారం వల వేస్తాము అని రెండు దోనెలు మునుగునంత విస్తారమైన చేపలు పట్టారు. పేతురు, అందరు విస్మయమొందిరి. ఇంత పెద్ద చేపలరాశిని అంతకు ముందు వారేనాడు చూడలేదు. అందుకే విస్మయమొందారు. ఆ చేపలరాశిని జబదయకు, పాలివారికి అప్పజెప్పి పేతురు, అంద్రెయ, యాకోబు, యోహాను యేసుతో 'ఫుల్‌టైం' వర్కర్లు అయ్యారు.

అప్పటినుండి నిమిషం, నిమిషం యేసు చేసే ఆశ్చర్యకార్యాలు చూస్తూనే ఉన్నాడు. కానీ ఇప్పుడు శిష్యులు ఈ జనసమూహమును పంపించివెయ్యి. వారు వెళ్ళి ఎక్కడైనా భోజనము కొనుక్కొని తింటారు అని అంటే ప్రభువు మీరే వారికి అన్నం పెట్టండి అన్నాడు. ఆల్‌రైట్ అయ్యా! నువ్వు పెట్టమంటే ఎందుకు పెట్టము అనలేదు. కానీ డబ్బులు లెక్కపెట్టారు.

యేసును ఎరిగిన నాటనుండి, విశ్వాస జీవితంలో మనం అడుగు పెట్టిన నాటనుండి ఆయన మన జీవితాలలో ఎన్ని ఆశ్చర్యకార్యాలు చేశాడు? మనం మరచిపోతాము. అందుకని మన చేతిలో డబ్బుని దేవుని పనికి ఇవ్వాలంటే రెండువందల దేనారములు చాలవే? అంటాము. అది ఎంత చిన్నదైనా నీ జీవనమంతా ఆయన అనుగ్రహించాడు. ఆయన ఆశ్చర్యకార్యాలు జరిగిస్తాడు. ఈ అయిదు రొట్టెలు, రెండు చిన్న చేపలు ఇంతమందికి ఇవి ఏ మాత్రము అంటే వారు తృప్తిగా తిన్న తర్వాత తలా ఒక గంప, రొట్టెలు, చేపలు వడ్డించటంలో కష్టపడిన పన్నెండు మంది శిష్యులకు బోనస్‌గా వచ్చాయి.

మనల్ని విస్తారముగా దీవించాలని ప్రభువు కొన్ని పద్ధతులు ప్రవేశపెట్టాడు. నేను ఆకాశపు వాకిండ్లను విప్పి పట్టజాలనంత విస్తారముగా దీవెనలు కుమ్మరించెదను అని ప్రభువు చెప్తున్నాడు.

సాక్ష్యము

# నమ్మదగిన దేవుడు

నా పేరు సరళ మా నాన్న సబ్ఇన్‌స్పెక్టర్, అమ్మ హెల్త్‌విజిటర్‌గా పని చేసేది అమ్మకు నాన్నకు మేము ముగ్గురం పిల్లలం. ఒక అన్న, అక్క, నేను. నేను టీచర్‌ను. మేము నామకార్ధ క్రైస్తవులుగా జీవించేవారము. నాకు హిందూ ఫ్రెండ్స్ ఉండేవారు. వాళ్ళతోపాటు నాగుల చవితికి పుట్టకు వెళ్ళి పాలు పోయటం, దసరాకు జమ్మిచెట్టుదగ్గరుకు వెళ్ళి జమ్మిపత్రి తెచ్చి పెద్దల కాళ్ళకు మ్రొక్కి ఆశీర్వాదం తీసుకొవటం, నాగూర్ దర్గా దగ్గరకు పోయి నెమలి పించంతో దూపం వేయించుకోవటం వంటివి చేసేదాన్ని. హిందువులు, ముస్లిమ్స్ మా అమ్మకు నాన్నకు స్నేహితులుగా ఉండేవారు గనుక, పెళ్లిళ్ళు ఉంటే మేము కూడా గుడులకు, గోపురాలకు, వెళ్ళేవాళ్ళము అలాగే నాగపట్నానికి వెళ్ళి గుండు కొట్టించుకోవడం వంటి ఎన్నో ముర్ఖపు పనులు చేస్తూ పేరుకు క్రైస్తవులగా జీవించేవారము.

2008 జనవరి 26వ తారీకునా నాభర్త, మానాన్న ఇద్దరూ బైకుమీద మార్కాపురం తిప్పాయిపాలెం నుంచి కంభంకు మా చిన్నాన్నదగ్గరకు వెళ్తూ బైక్ స్కిడై కింద పడ్డారు. సరిగ్గా వాళ్ళు గవర్నమెంట్ హస్పటల్ ముందు పడ్డారు. అయితే ఆ రోజు రిపబ్లిక్ డే కావడంతో హాస్పిటల్ సిబ్బంది అంతా జండా వందనం చేసి 12 గం॥కు హాస్పిటల్ క్లోజ్ చేసి వెళ్తూ జరిగిన ఘటన చూసి నా భర్తను, నాన్నను లోపలకు తీసుకుపోయారు. బైకు హ్యాండిల్ నా భర్త కడుపులో బలంగా తాకింది. పెట్రోల్ ట్యాంకు వచ్చి పొట్టమీద పడింది. లోపల గాయం అయింది, అంతగా గుర్తించలేదు. బయటకు మాత్రం ఎడమ మోకాలికి కొంచెం గాయం అయింది. కుడిమణికట్టు దగ్గర కొంచెం చీలింది. శుభ్రపరచి గాయాలకు మందురాసి, చీలిన వాటికి కుట్లువేసి ఇంటికి పంపారు. తర్వాత నా భర్త కడుపునొప్పితో చాలా బాధపడుతున్నాడు. బయటతగిలిన వాటికి మందు రాశారు. కాని, లోపలి సమస్యను ఎవరు గమనించలేదు. నంది కొట్కుర్ వాసవి హస్పటల్‌కి వెళ్ళాము. వాళ్ళు కూడా పైన తగిలిన గాయాలకు ఎక్స్‌రే తీశారు. కడుపు నొప్పి గురించి అడిగితే, కడుపులో 8 లేయర్స్ ఉంటాయి అంతదాక ఏమీ గాయం తగలదు మీకు గ్యాస్‌ప్రాబ్లం అయుండవచ్చు అని అనేక రకాల మందులు ఇస్తున్నారు. నాభర్తకు కడుపు నొప్పి తీవ్రంగా ఉండేసరికి కర్నూల్ పద్మచంద్ర హస్పటల్‌కు తీసుకెళ్ళాము. వాళ్ళుచూసి యం.ఆర్.ఐ తీస్తే బాగుండు కడుపు లోపల ఏముందో తెలుస్తుందని స్కానింగ్ కోసము 2 లీటర్ల నీళ్ళు తాపించారు. అంతా నార్మల్, నో ప్రాబ్లం అన్నారు. కాని కడుపునొప్పి మాత్రం తగ్గలేదు.ఆ మరుస టిరోజు డాక్టర్స్ ఈకేసు సర్జన్‌కి అప్పగించాలి అన్నారు . కారణం ఏంటంటే 2 లీటర్‌ల వాటర్ తాగేసరికి బైక్ హ్యాండి ల్ తగిలి ఒత్తుకుపోయిన పేగులు చిట్లిపోయాయి. లివర్‌కి గాయమై చినిగిపోయింది. తిన్న ఇడ్లీ, టాబ్‌లేట్సు మొత్తం పొట్టలోకి చేరి చీముపట్టింది. దాని వల్లే కడుపు నొప్పి వస్తుంది అని, విశ్వభారతి మల్టీస్పెషాలిటి హస్పిటల్‌కి రిఫర్ చేశారు. అక్కడ డాక్టర్ నా భర్తను పరీక్షించి రిపోర్ట్స్ చూసి, ఇతను రెండు గంటలు కన్నా ఎక్కువ బ్రతకడు. ఆపరేషన్ చేసినా, చేయకపోయినా బ్రతకడు అని చెప్పాడు. సీరియస్ కండీషన్ ఈ కేసు మేము టేకప్ చేయలేము కళ్లు తేలేస్తున్నాడు, ఊపిరి తీసుకోవటం కష్టమైపోయింది పల్స్ పడిపోయాయి. బీపి డౌన్ అయ్యింది కళ్లు పచ్చగా ఉన్నాయి అన్నీ అటాక్ అయిపోయాయి అని చెప్పాడు. డాక్టరు చెప్పిన మాటలు విన్నప్పుడు చాలా భయపడ్డాను. ఈ డాక్టర్లు డబ్బులు కోసం చెప్తున్నారా? బాగున్నాడు కదా. గంట కంటే ఎక్కువ బ్రతకడు చనిపోతాడు ఏమి లేదు అయిపోయింది అంటున్నారే ఎందుకు? ఇలా చెప్తున్నారు ఇది నిజమా అబద్ధమా కాసేపు నాకు ఏమీ అర్థం కాలేదు. సార్ మీరు ఆపరేషన్ చేయండి బ్రతకటము బ్రతకక పోవటము దేవుని చేతిలోవుంది మీ పని మీరు చేయండి సార్ అని డాక్టర్

గారితో చెప్పాను. డాక్టరు గారు ఆపరేషన్ చేయడానికి అంగీకరించారు, కానీ ఆపరేషన్ మధ్యలో చనిపోవచ్చు దానికి మేము బాధ్యులం కాదు అని ఒప్పందం పత్రం మీద సంతకం చేయించుకున్నారు. 2008న ఫిబ్రవరి 2 శనివారం నా భర్తను ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్ళారు. రక్తం 7% మాత్రమే ఉంది ఆపరేషన్ కష్టమౌతాది అన్నారు. 3గం॥ల 30ని॥కు ఆపరేషన్ స్టార్ట్ చేశారు. నాభర్త మళ్ళి తిరిగి వస్తాడో రాడో చూసుకోవటం అదే ఆఖరిసారి కావచ్చు అనుకున్నాను. నాకు ఇద్దరు చిన్నపిల్లలు. బాబుకి 10 సం॥లు పాపకి 5సం॥లు. సాయంత్రం 5:30కు ఆపరేషన్ అయిపోయింది. ఏమి వినవలసి వస్తుందో అని భయపడ్డాను అయితే ఆపరేషన్ సక్సెస్, బాగానే ఉన్నాడు కాకపోతే అతను బాగా కోలుకోవాలి అన్నారు డాక్టర్. మరుసటి రోజు ఆదివారము చర్చి చూసుకోవాలి అని ఆరాధన కొరకు ప్రార్థన చేస్తుంటే దేవుడు యెషయా 54:10 ***పర్వతములు తొలగిపోయినను మెట్టలు తత్తరిల్లినను నా కృప నిను వీడిపోదు.*** ద్వారా మాట్లాడాడు. ఎంత పెద్ద ఆపరేషన్ చేసినా 3రోజుల్లో కోలుకుంటారు కానీ నా భర్త కోమాలోకి వెళ్ళాడు. ఆపరేషన్ చేసి కడుపులో ఉన్న చీమంతా తీసేశారు. ఆ తరువాత ఆయన శరీరంలో నుండి ఎటువంటి వ్యర్థాలు బయటకు రావడం లేదు. యూరిన్ బయటకు పోవడం లేదు. శరీరంలోకి వెళ్తున్న మందులు లిక్విడ్స్ చీముగా మారి రక్తంలో కలిసి పోతున్నాయి. 2లక్షల విలువగల మందులను నా భర్త దేహంలోకి పంపారు, ఇంకా మందులు ఇస్తున్నారు కాని స్పందనే లేదు. అప్పుడు డాక్టర్లు, ఇంతఖర్చు పెట్టారు మా ప్రయత్నం మేము చేశాము ఇంక తీసుకెళ్ళండి మందులు కూడా పని చేయటం లేదు, యం.యల్.సీ కేసు కాబట్టి పోస్టుమర్టం చేసి పంపిస్తాము అన్నారని, మా నాన్న నాకు ఫోన్ చేసి చెప్పి, మరి మోజెస్‌ని ఇక్కడకి తీసుకు రమ్మంటావా? అని అడిగాడు. నాకేం చెప్పాలో తెలియక, నేను చర్చ్‌కి వెళ్ళి ప్రార్థన చేసి చెప్తాను నాన్నా అని చర్చ్‌కి వెళ్ళాను. చర్చ్ ఎంట్రన్స్‌లోనే ఒక స్వరం ***శ్రమదినమున నీవు కృంగిన యెడల నీవు చేతకానిదావవగుదువు*** అన్నది. ఆ స్వరం ఎప్పుడైతే నా చెవిన పడిందో అది నా హృదయాన్ని తాకింది. నాకున్న కలవరము, భయముపోయాయి. దేవుని సన్నిధికి వెళ్ళి మోకాళ్ళమీదపడి దేవా, కర్ణాటక నుండి మీరు సేవకు పిలిచింది ఇందుకేనా? నాయనా, సగంలోనే ముగిసిపోవటం కోసమా? నా భర్తపట్ల నీ చిత్తమేమిటి? నాయనా అని దేవుని సన్నిధిలో ప్రార్థన చేస్తున్నప్పుడు యోహాను 11:4 లోని వాక్యాన్ని చదవమన్నాడు. ***ఈ వ్యాధి మరణము కొరకు వచ్చినది కాదు దేవుని కుమారుడు దాని వలన మహిమ పరచబడటానికి వచ్చింది.*** ఆ వాక్యము చదవగానే నాన్నకు ఫోన్ చేసి నాభర్తను సి.సి నుండి బయటకు తీసుకురావద్దు దేవుడు నా భర్తను బ్రతికిస్తాడు నాకు వాగ్దానం ఇచ్చాడు ట్రీట్‌మెంట్ ఇవ్వకపోయినా పర్వలేదు సి.సిలోనే పెట్టండి బయటకు మాత్రం తేవద్దు అన్నాను. పోస్టుమార్టం చేయాలి కాబట్టి ముందుగా గాయాల వివరాలను నోట్ చేసుకోడానికి పోలీసులు వచ్చారు. బంధువులు, తెలిసినవారు, మోజెస్ చనిపోయాడు అని హస్పటల్‌కి వెళ్ళి చూడటం, పరామర్శించడానికి ఇంటికి రావడం మొదలైంది. మా ఇంటినిండా జనం, అయ్యో చిన్న పిల్లలు ఎందుకు ఇలా అయ్యింది? ఏమి జరిగింది ? అని ఆరాలు తీయటం, అసలు వీళ్ళకు సేవకు పిలుపు వుందో?లేదో ? ఇతను ప్రార్థన చేస్తే అందరు బాగుపడినారే? ఇలాంటి మాటలు విన్నప్పుడు నాకు చాలా దుఃఖమేసింది. నేను చర్చిలో కూర్చొని, ఈ శ్రమ కాలాన్ని నేను ఏలా జయించాలి? బైబిల్ గ్రంథంలో చాలా మందికి శ్రమ కలిగినప్పుడు మీరు జ్యోక్యం చేసుకున్నారు కన్నీటితో నీ పాదాల దగ్గరకు వచ్చినప్పుడు అద్భుతాలు చేశావు తండ్రీ మార్త మరియల తమ్ముడు లాజరు చనిపోతే వారి కన్నీళ్ళు చూచి వారి తమ్ముడ్ని బ్రతికించి సజీవుడుగా వారికి అప్పగించావు గదా తండ్రీ. విధవరాలు ఒక్కగానొక్క కుమారుడు చనిపోయినప్పుడు ఆమె కన్నీటిని తుడిచి కుమారుడిని బ్రతికించి తల్లికి అప్పగించారు కదా ప్రభువా. నా భర్తను కూడా బ్రతికించి నువ్వు మహిమపరచుకో తండ్రీ. నా కొరకు నా సుఖం కొరకు నేను బ్రతికించమని

అదగటంలేదు తండ్రీ, ఇచ్చిన సంఘం చెదరిపోతుంది ప్రభువా, పిల్లలు అనాథలైపోతారు అని కన్నీటితో ప్రార్థన చేస్తున్నాను. నేను దేవుని సన్నిధిలో నా పాపాలన్నీ ఒప్పుకుంటున్నప్పుడు నా భర్త దేహంలో దేవుడు కార్యం చేయటం మొదలపెట్టాడు దేహంలో నుండి యూరిన్ ఒక్కొక్క డ్రాప్ పడటం మొదలైంది అంతకముందు శరీరం చనిపోతే ఎలా ఉబ్బుతుందో అలా ఉబ్బిపోయింది. బంధువులందరూ, డాక్టర్లు చనిపోయాడు అని చెప్పారు కాదా ఇప్పటికే 10 రోజులైంది. సరళకు మానసిక ఒత్తిడితో పిచ్చి పట్టి బ్రతుకుతాడు, దేవుడు బ్రతికిస్తాడు అంటుంది. మీరేంటి సార్ ఆమె మాట విని ఇంకా ట్రీట్‌మెంటు కొనసాగిస్తున్నారు అని నాన్నతో అంటున్నారు. సమాధి స్థలం చూశారు సమాధి పెట్టె తెచ్చారు. కానివ్వండి కానివ్వండి అంటున్నారు . మా బంధువులలో చాలా మంది దూరం నుండి, సెలవులు పెట్టుకొని మరీ వచ్చారు కాబట్టి మేము మట్టేసి పోవలసిందే అని తొందరపెడుతున్నారు. మా నాన్న పోయేవాళ్ళు ఉంటే పొండి , బ్రతికితే బ్రతికించుకుంటాము లేకుంటే సమాధి చేస్తాము. మీరు మట్టేయలేదని ఫీలవద్దు దయచేసి వెళ్ళిపోండి అన్నారు. బంధువులందరు ఏవేవో చెప్పి భయం రేపుతున్నారు. అన్ని నెగిటివ్ మాట్లే మాట్లాడుతున్నారు వీళ్ళదగ్గర కూర్చుంటే ఉన్న విశ్వాసం పోతుందని చర్చికి వెళ్ళాలి అనుకున్నాను. ఇంతలో నా కుమారుడు వచ్చి మమ్మీ, డాడి చనిపోయాడంటగా మా స్కూల్లో మా సార్ వాళ్ళు మా ఫ్రెండ్స్ అందరు వెళ్ళి చూశారంట కదా నిజమా? అని అడుగుతున్నాడు. అంతలో నా కూతురు చచ్చిపోవడ అంటే ఏంటి మమ్మి? అని అడుగుతుంది. ఆ ప్రశ్నలకు చాలా దుఃఖమేసింది. నేను అలసిపోయాను తండ్రీ ఈ చిన్న పిల్లలకు మీరే సమాధానం చెప్పండి తండ్రీ నేను ఏమి చెప్పలేని స్థితిలో ఉన్నాను ఇంతకంటే నాకు ఎలా ప్రార్థన చేయాలో తెలియటంలేదు. పిల్లలిద్దర్ని దగ్గరకు తీసుకొని లేదు నాన్న, డాడి చనిపోలేదు దేవుడు బ్రతికిస్తాడు. దెబ్బతగిలింది హాస్పిటల్లో మందు తీసుకుంటున్నాడు, వస్తాడు అని పిల్లల్ని సముదాయించి మందిరానికి బయలుదేరాను.

నీవు నా భర్తను బ్రతికిస్తే ఇంటికి వెళ్తా ప్రభువా లేదంటే నేను ఇంటికి వెళ్ళను. జనాలు అనే మాటలు నేను ఎదుర్కోలేను నాయనా అని ఏడుస్తున్నాను. నాకు ఇల్లు పిల్లలు ఏమీ పట్టలేదు చర్చ్‌లో ప్రార్థన చేస్తున్నాను, దేవుడు ఈరోజు నాతో ఏమీ మాట్లాడతాడో ఏ వాక్యం ద్వారా నన్ను బలపరుస్తాడో ఇదే నా ఆలోచన. 12వ తారీకు రాత్రి ఒంటి గంట సమయాన ప్రభువు నా ఎదురుగా నిలబడ్డారు, అతనిని ఎక్కడ వుంచారు? అని అడిగారు. విశ్వభారతి హాస్పటల్లో సి.సి ఉంది కదా నాయనా, రైట్‌సైడ్ వెళ్ళి లెఫ్ట్ తిరగండి రెండవదే నా భర్త బెడ్ అన్నాను. ప్రభువు నా భర్త తలను ముడుతుండటం స్పష్టంగా చూశాను. ఆ రోజు వేకువజామునే లేచి తలస్నానం చేసి మందిరంలో ప్రార్థన చేస్తు ఉన్నాను. చాలా సంతోషంగా వుంది కీర్తనలు చదువుతూ ఉన్నప్పుడు దేవుడు నాతో నీవు నా కుమారుడవు నేను నిన్ను కనియున్నాను అనే వాక్యం ద్వారా మాట్లాడాడు. ఫిబ్రవరి 13 తేదినా దేవుడు నా భర్తను బ్రతికించాడు. దేవుడు అద్భుతం చేశాడు. డాక్టర్సు ఇతను నడువటానికి ఒక్క సం॥ము పడుతుంది అన్నారు. కానీ దేవుని కృపను బట్టి ఒక్క నెలలోనే నడవగలిగాడు. హాస్పటల్‌కి వెళ్ళేటప్పుడు 77కేజీలు ఉన్నాడు. హాస్పటల్ నుండి ఇంటికి వచ్చేటప్పుడు 35 కేజీలు ఉన్నాడు. ఎముకలు మాత్రమే ఉన్నాయి. శరీరం వికారమైపోయింది. నా కొడుకు మమ్మి ఈయన మన డాడీ కాదు వేరే వాళ్ళ డాడి అన్నాడు. నా కూతురు చాటునుండి చూసి లోపలకి పరిగెత్తుకుంటూ పోయింది. నా భర్త చాలా దుఃఖపడేవాడు, ఏడ్చేవాడు. కానీ దేవుడు ఆయన కృపను బట్టి శక్తినిచ్చి బలానిచ్చి ఒక నెలలోనే వాకర్ మీద నడిపించాడు. ఈ రోజు ఆ దేవాది దేవునికి సజీవ సాక్ష్యంగా నిలబడ్డాడు. దేవునికి స్తోత్రం. చనిపోయాడు అని సమాధిలో పెట్టవలసిన వ్యక్తిని దేవుడు బ్రతికించాడు. శ్రమల ద్వారా నేను వెళ్తున్నప్పుడు నన్ను ఆదరించి నాకు నిరీక్షణ కలుగజేసి, నా భర్తను బ్రతికించిన ఆ దేవాది దేవునికి వందనాలు. మేము చేయుచున్న సేవనిమిత్తము ప్రార్థించాలని మనవి.

చిన్నపిల్లల పేజి

# బైబిలు కథలు - ఎలీషా

పిల్లలూ!ఎలా ఉన్నారు? హోమ్ వర్క్‌తో బిజీగా ఉన్నా కొంత సమయాన్ని, ప్రార్థించుటకు, బైబిల్ చదువుటకు వెచ్చించడం మర్చిపోకండి. దేవుని జ్ఞానాన్ని తెలుసుకోండి. మరి ఈ రోజు కథలోకి వెళ్దామా.

అహాబు కుమారుడైన యెహోరాము ఇశ్రాయేలీయులకు రాజుగా ఉన్న కాలంలో ఏలీయా శిష్యుడును, షాపాతు కుమారుడునైన ఎలీషా ఇశ్రాయేలీయులకు ప్రవక్తగా ఉన్నాడు. ప్రవక్తలకు శిష్యులుండేవారు. ఆ శిష్యులలో ఒకడు చనిపోగా అతని భార్య ఎలీషా దగ్గరకు వచ్చి నా భర్త చేసిన అప్పుల వలన నా కొడుకులను దాసులుగా తీసుకెళ్తున్నారు అని చెప్పింది. అందుకు ఎలీషా నీ దగ్గర ఏముంది అని అడగగా ఒక నూనె కుండ తప్ప ఇంకేమి లేదు అంది. సరే ఇరుగు పొరుగు వాళ్ళ దగ్గర నుండి తెచ్చుకోగలిగినన్ని పాత్రలు అడిగి తెచ్చుకొని నీవు నీ కుమారులు ఇంట్లో తలుపులు వేసుకోని అడిగి తెచ్చుకున్న పాత్రలను నూనెతో నింపి, నిండినవి ఒక ప్రక్కన పెట్టమని చెప్పాడు. శిష్యుని భార్య ఆ ప్రకారమే చేసి ఇంకా పాత్రలు తెమ్మనప్పుడు ఆమె కుమారుడు తెచ్చిన అన్ని పాత్రలు అయిపోయాయి అన్నాడు. అంతలోనే నూనె ఆగిపోయింది. వెంటనే ఆమె ఎలీషా దగ్గరకు వచ్చి జరిగిన సంగతి చెప్పగా ఎలీషా ఆ నూనె అమ్మి అప్పులు తీర్చి మిగిలిన దానితో నీవు నీ పిల్లలు బ్రతకండి అని చెప్పాడు.




షూనేము అనే పట్టణంలో ఘనురాలైన ఒక స్త్రీ ఉండేది. ఎలీషా ఆ పట్టణానికి వచ్చినప్పుడు విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా ఈ ఘనురాలు తన భర్త అనుమతితో ఒక గది కట్టించి, అందులో ఎలీషా కొరకు మంచము, బల్ల, పీట, దీప స్థంభము పెట్టించింది. ఇంత శ్రద్ధ చూపడానికి కారణం ఏమై ఉండొచ్చు? అని గేహజీతో అనగా గేహజీ, ఆమెకు కుమారుడు లేడు అని చెప్తాడు. ఎలీషా ఆమెతో వచ్చే సంవత్సరము ఈ సమయానికి నీకు కొడుకు పుడుతాడు అని చెప్తాడు. ఎలీషా చెప్పిన విధంగానే ఆమెకు ఒక కొడుకు పుడతాడు. వాడు ఎదిగిన తర్వాత ఒక రోజు పొలంలో వాళ్ళ నాన్నతో ఉన్నప్పుడు నా తల పోయింది తలపోయింది అని అంటూ ఉన్నప్పుడు వాడి తండ్రి ఆ చిన్నవాడిని వాళ్ళ అమ్మ దగ్గరకు పంపినపుడు వాడు తన తల్లి ఒడిలో పడుకున్న కాసేపటిలో చనిపోగ, ఆమె తన కుమారున్ని ఎలీషా మంచంపై పడుకోబెట్టి గాడిదనెక్కి ఎలీషా దగ్గరకు బయలుదేరింది. ఆమెను దూరం నుండి చూచిన ఎలీషా తన శిష్యుడైన గేహజీని పంపి ఆమె క్షేమ సమాచారం కనుక్కోమని పంపాడు. గేహజీ ఆమెకు ఎదురువెళ్ళి, నీవు నీ కుమారుడు నీ భర్త క్షేమమా అని అడిగినప్పుడు ఆమె క్షేమమే అని చెప్పి వడిగా వచ్చి ఎలీషా పాదాలను చేరి కొడుకు కావాలి అని నేను అడిగానా? అని అంది. అప్పుడు ఎలీషా తన దండాన్ని గేహజీకి ఇచ్చి ఎవరు ఎదురు వచ్చిన నమస్కరించవద్దు, ఎవరైన నమస్కరిస్తే తిరిగి నమస్కరించవద్దు సరాసరి గనురాలి ఇంటికి వెళ్ళి ఆ దండాన్ని ఘనురాలి కొడుకు ముఖము

మీద పెట్టమని చెప్పి పంపాడు. ఎలీషా చెప్పిన ప్రకారం గేహజీ ఘనురాలి కుమారుని ముఖంపై దండాన్ని పెట్టినప్పటికి ఆ బాబు పరిస్థితిలో ఎటువంటి మార్పు రాకపోవడంతో గేహజీ ఎలీషా దగ్గరకు తిరుగు ప్రయాణమయ్యాడు. అయితే ఆ ఘనురాలు ఎలీషా తనతో వస్తేకాని నేను కదలను అని ఎలీషా పాదాలను పట్టుకుంది. ఎలీషా, ఘనురాలు షూనేముకు బయలు దేరారు. వారు వారి గమ్యస్థానానికి దగ్గర్లో ఉన్నప్పుడు గేహజీ వారిని ఎదుర్కొని బాలుడు మేల్కొనలేదని చెప్పాడు. అప్పుడు ఎలీషా ఆ ఘనురాలి ఇంటికి వెళ్ళి, బాలుడు చనిపోయి తన మంచం మీద పడుకోబెట్టి ఉండటం గమనించి తలుపువేసి ప్రార్థన చేసి ఆ బిడ్డపై తన్ను చాచుకొనగా బిడ్డకు వెట్ట పుట్టింది. మరల ఇంకోసారి అలా చేయగా ఆ బిడ్డ ఏడు మారులు తుమ్మి కళ్ళు తెరిచెను. అప్పుడు ఆ బిడ్డను ఘనురాలికి అప్పగించెను.

ఎలీషా గురించి మరికొన్ని విషయాలు వచ్చే మాస పత్రికలో తెలుసుకుందాం!

---

**9వ పేజీ తరువాయి....**

తల్లిగర్భంలో నీవు రూపింపక మునుపే, భూమికి పునాది వేయబడక మునుపే ఆయన నిన్ను ఎన్నుకున్నాడు. నీ కొరకు ఆయన ఎన్నో మెట్లు దిగివస్తే కనీసం నీవు ఆయనను గుర్తించావా. పాతనిబంధనలో దేవుడు మహోన్నతునిగా సమీపించాడని, గొప్ప ప్రవక్తలకు తప్ప సామాన్య మానవులకు అందుబాటులో వుండనివాడు, దేవుడు అనే భావన ఉంది. క్రొత్త నిబంధనలో దేవుడు తనను తాను దీనమనస్సు కలిగిన వానిగా మనలో, మనతో నివసించెను. తనను తాను మన కొరకు తగ్గించుకున్నాడు. మరి ప్రస్తుత కాలంలో ఇంకా ఒక అడుగు ముందుకు వేసి పరిశుద్ధత్మ రూపంలో మనలో నివసించడం మొదలు పెట్టాడు. చూశారా! దేవుడు నీ కొరకు ఎన్ని దశలలో మార్పు చెంది నిన్ను తనవానిగా చేసుకోవాలని ఆశపడుతుంటే ఆయనను నీవు గుర్తించవా! ఆయన ప్రేమను నీవు గమనించావా!

దినమెల్ల దేవుడు నీ కొరకు తన చేతులను చాపి ఎదురు చూస్తువుంటే నీవు మాత్రం ఆయన దగ్గరకు రావటానికి ఇష్టపడక లోక ఆశలలో కొట్టుమిట్టాడుతున్నావు. ఈ లోకంలో ఆయన నీకు ఆహారాన్ని ఏర్పాటుచేసి, నీ రాక పోకలలో నిన్ను సంరక్షించి, నీ పంటను, నీ చేతి పనిని ఆశీర్వాదించి, ఏ తెగులు నీ గుఢారమునకు, నీ ఇంటికి తగులకుండా ఆయన కనుపాప వలె నిన్ను కాచి కాపాడుతుంటే నీవు మాత్రం ఈ లోక భోగములకు ఆశపడి ఆయనను తృణీకరిస్తున్నావా? ఈ రోజు దేవుడు నీతో మాటలాడుతున్నాడు. ఆ స్త్రీ తన జీవితాన్ని యేసు పాదాల చెంత పెట్టినట్లు. నీవు కూడా నీ జీవితాన్ని ఆయన పాదాలచెంత వుంచినట్లయితే ఆయన నీ విషయమై ఎంతో సంతోషిస్తాడు.

మారు మనస్సు పొందు ఒక్క పాపి విషయం పరలోకంలో ఎక్కువ సంతోషము. ఆయనకు అంత గొప్ప సంతోషం ఇవ్వలంటే అది కేవలం నీ వలన మాత్రమే సాధ్యము. నేను పాపిని ప్రభువా! నన్ను కరుణించు అని నీవు ఆయన పాదాల చెంతకు వచ్చినట్లయితే ఆయన ప్రేమా స్వరూపి, నిన్ను నీ బ్రతుకును మార్చి ఉన్నతంగా నిన్ను చేయగలడు. అటువంటి గొప్ప దేవుడు మన యేసు దేవుడు.

ఆయన మన కొరకు రక్తం కార్చుటకు గల కారణం నిన్ను నన్ను ఉన్నతంగా ఆశీర్వాదించాలని ప్రకాశింపచేయబడాలని ఆయన మనలను ఎన్నుకున్నాడు. నీవు ఆయన ప్రణాళికలో భాగము కాబట్టి నీవు ఆయన వద్దకు వచ్చి ఆయన దగ్గర నేర్చుకో. మన జీవితాన్ని ఆయనలా విలువగా మరి ఎవ్వరు చూడలేరు. ఆస్త్రీ జీవితాన్ని ఆమెపై వచ్చిన విమర్శలను దేవుడు అడ్డుకున్నాడు. ఈ రోజు నీవు కూడా నీ జీవితాన్ని యేసుకు సమర్పిస్తే నీ జీవితంలో వున్న విమర్శలను, దోషాలను, పాపాలను యేసు ఎదుర్కొని నిన్ను తన వానిగా నిలుపుకుంటాడు. అంతటి గొప్ప జీవితాన్ని దేవుడు మీకు అనుగ్రహించునుగాక ఆమెన్... **(సమాప్తం)**

# క్రొత్త కోణాలు

## 6. ధన్యతలు : విరిగిన హృదయం-దొరికె ఆదరణ

## Beatitudes

**"దుఃఖపడువారు ధన్యులు వారు ఓదార్చబడుదురు" మత్త. 5:4**

"Blessed *are* they that mourn: for they shall be comforted"_ KJV.

**"ఇప్పుడు ఏడ్చుచున్న మీరు ధన్యులు, మీరు నవ్వుదురు" _ లూకా 6:21బి.**

**కొని తెచ్చుకొన్న కష్టాలతో, కాలదన్నుకొన్న అవకాశాలలో, కొట్లాటల్లో కుమిలి కుమిలి ఏడుస్తూ, కన్నీరు కుండపోతగా యేడ్చేవారు ధన్యులా? వారిని ఆదరించి ఓదార్చే వాగ్దానం క్రీస్తు తన రాజ్యంలో ఇస్తానని వాగ్దానం చేస్తున్నాడా? ఈ క్రొత్తకోణాల్లో పరిశీలిద్దాం.**

దుఃఖపడటం, ఏడ్పు, రోదన, అంగలార్పు.... ఏ కోణంలో చూచినా ధన్యత అనిపించుకోదు. ఇవన్నీ సంతోషానికి వ్యతిరేకం. అబ్రాహాము శారా మృతి పొందగా ఆమె నిమిత్తం అంగలార్చటానికి, ఏడ్వటానికి పోయాడు (ఆది. 23:2); యెహోవా విసర్జించిన సౌలుకోసం సమూయేలు ఎంతోకాలం దుఃఖించాడు (1సమూ. 16:1); స్నేహితులు యోబుకు కలిగిన అవస్థను విని ఆతనితో దుఃఖించారు, ఓదార్చారు (యోబు 2:11). ఆ ఓదార్పు యోబుకు సంకటంగా మారిందను కోండి! యోసేపు చనిపోయా డని విని యాకోబు అంగలా ర్చాడు (ఆది. 37:34). ఆ సమయంలో తన కుమా రులు ఆతణ్ణి ఓదార్చారని ఉంది. ఎంత కుత్సితం. తండ్రి దుఃఖానికి కారకులే ఓదార్చటమా! దావీదు తన కుమారుని కోసం అంగ లార్చాడు (2సమూ. 13:37) _ ఆ కుమారుడెంత అధ్వాన్నపు పనిచేసిన వాడైనా. యేసు తాను ప్రేమించిన లాజరు మర ణించినట్లు విని కన్నీరు విడి చాడు (యోహా. 11:35).

అక్కడ (నరకంలో) పండ్లు కొరుకుట, ఏడ్పు ఉంటాయి (మత్త. 13:4). ఇలాంటివన్ని తీరని వ్యధ, దుఃఖం చూపేవి. ఇవన్నీ ఎలా ధన్యతలౌతాయి?

ఇటీవల (జూన్,1999లో) నా తుంటి ఎముక బంతి చిట్లి ఒక పెద్ద ఆపరేషన్ చేయించుకోవాల్సి వచ్చింది. మూలిగే నక్కపై తాటికాయ అన్నట్లు దానికి ముందు గుండె బైపాస్ ఆపరేషన్ చేశారు. దేవుని కృపవలన నెలాఖరుకు ఇల్లుచేరాను. ఎంతో మంది సహృదయులు పలుకరించిపోయారు. ఒక కడు వృద్ధురాలు చూడవచ్చింది. వలవల ఏడ్చింది. ఆమె ఎందుకు ఏడ్చిందో నాకు తెలియదు. నేనే ఆమెను ఓదార్చవలసి వచ్చింది. ఇందులో ఎవరికి ధన్యతో తెలియటం లేదు.

కనుక, కష్టాల్లో, నష్టాల్లో, బాధల్లో, కొన్నిసార్లు సుఖాల్లో సహితం దుఃఖం కలుగుతుంది. అందుకు, ఎలానైతేనేం ఎవరో ఒకరు ఓదార్చేవారు ఉంటూనే ఉంటుంటారు.

అసలు యూదులు మెస్సీయా కోసం ఎదురు చూడటంలో_ 'యెహోవా ప్రతివాని ముఖము చూచి బాష్ప బిందువులను తుడిచి వేయును' అని ఉంది. ఈ మాటలు 1తిమో. 4:13-18, ప్రక. 7:9-17 ప్రకారము వెయ్యేండ్ల ముందట పునరుత్థానులగు పరిశుద్ధుల విషయం చెప్పబడితే 'ప్రతివాని' అనేమాటను బట్టి ప్రతిఒక్కరూ ఏడిస్తే చాలు ఓదార్పు పొందుతారనే భావనకు దారితీస్తుంది. యేసుక్రీస్తు ఉద్దేశం ఇలాంటి పైపై అర్థాల్లో చెప్పబడలేదని మనం గ్రహించ వచ్చును.

### దుఃఖించుట

ఈ వచనములో ఉపయో గించిన 'దుఃఖపడు' అను మాటకు ఉపయోగింప బడిన గ్రీకు మాట 'పెన్థియో' (pentheo) సాధారణ మైన దుఃఖపడుట కుపయోగించు మాటకాదు. ఒక సన్నిహితుని మరణ కారణంగా దుఃఖించుటను సూచించునది.'ఆయనతో ఉండినవారు దుఃఖపడి యేడ్చు చుండగా' (మార్కు 16:10-11), 1కొరి. 5:2; యాకో. 4:9లలో కూడ ఉపయోగింపబడినది. ఈ విషయము మున్ముందు వివరింపబడుతుంది. గ్రీకులో, లోలోపల కలుగు సాధారణ దిగులుకు లూపియో (2కొరిం. 2:2;5 7:8,9; ఎఫె. 4:30) అనిన్నీ ఇంకా సామాన్యమైన 'ల్యూపియోమాయ్' అనుమాట గలదు (మత్త. 14:9;17:23; 26:37; రోమా14:15).

**పునశ్చరణ (Recapitulation)**

**ధన్యతలన్నింటికీ వర్తించే కొన్ని విషయాలను గత మాసం కొంత వివరంగా పొందుపరచటం జరిగింది. క్రొత్త చదువరులు, పాతవి గతించినవన్నట్లు క్రొత్తగా మొదలు పెట్టే చదువరులు కొన్ని విషయాలు గుర్తు చేసుకొంటేగాని వాని నేపథ్యం అర్థంకాదు.**

**కొండమీది ప్రసంగం (మత్త. 5,6,7 అ.) యేసురాజు పరలోకరాజ్య ప్రణాళిక** (Manifesto of the The Kingdom of Heaven) **అయితే అందలి తొలి పలుకులయిన 'ధన్యతలు' ఆ చట్టాంగానికి అవతారిక** (Preamble) **అనవచ్చు. అంటే యేసురాజ్య మౌలిక సూత్ర సంక్షిప్త సంచయంగా పరిగణించాలి.**

**ధన్యతల వాక్యనిర్మాణం ఇంగ్లీషులో** *are* **అనే క్రియతో భావార్థకాలు** (Statements) **కాగా, హెబ్రీ/అరామీలలో అవి క్రియాపదంలేని ఆశ్చర్యార్థకాలు** (Exclamations)**. తెలుగులో ఇంగ్లీషు వరుసే వచ్చింది. 'దుఃఖపడువారు ధన్యులు (అయియున్నారు)' అనే వాక్యం 'దుఃఖపడటం ఎంత ధన్యత' అవుతుంది.**

**ధన్యత అనే మాటకు గ్రీకుపదం 'మాకరియోస్'** (Makarios). **దీని అర్థం ఆ మాటను పేరుగాగల కుప్ర** (Cypres)**. ద్వీపాన్ని బట్టి గ్రహించవచ్చు. ఈ ద్వీపం ఒక ఆనందమయ ద్వీపం. సుందర సిరిసంపదానిలయం. సహజ ఖనిజ సంపత్తి, సస్యశ్యామలం అయిన లోటులేని చోటు. అలాంటి పరిపూర్ణ సంతోషదాయినినే ధన్యతగా గ్రహించాలి. ఇది పరలోక నివాసానికి ఇహలోక సాదృశ్యం.**

**వ్యాసరచనోద్దేశం:**

**పాత నిబంధనలో అబ్రాహాము మొదలు దేవునిని వెంబడించిన వారికి వాగ్దానం చేయబడ్డ దీవెనలు కోకొల్లలు (ఆది. 10:1-3, మలా. 3:10-12). అందుకు ప్రతిగా మన మా దేవుని జనంగా ఉండాలని పదిఆజ్ఞల్లో మన జీవితశైలిని పొందుపరచాడు. వానినే యేసు 'వద్దు', 'కూడదు' అనే మాటల్లో కాకుండా సానుకూల** (Positive) **పదాల్లో ధన్యతలుగా అభివర్ణించాడు. వినగానే యివెలా ధన్యతలురా బాబూ అన్నవి అనన్య బహుమాన సాధకాలుగా కొంత నిగూఢంగా ప్రకటించాడు. దీనిని ఆయన ఉద్దేశించిన క్రొత్త కోణాల్లో పరిశీలించడమే ఈ వ్యాసాల ఉద్దేశం.**

## మూడు విధములైన వివరణ

ఈ వచనమును మూడు విధములైన 'దుఃఖపడుట' తోను, ఒక్కొక్క సందర్భ ములో వాస్తవముంది.

**1**

మాటకుమాటగా దుఃఖపడటం : జీవితంలో సుఖదుఃఖాలు కావటికుండలు. ఎన్నో చేదు అనుభవాలవల్ల ఎంతో మనఃక్లేశం కల్గుతుంది. దీన్ని భరించటం, సహించటం ఒక ధన్యతే. ఎండ శుభమయిందే. కాని, ఎండ కాచి ఎడారయింది అని ఒక నానుడుంది. అలా బీడువారిన భూముల్లో గడ్డిపోచ కూడ మొలవదు _ పండ్లు, ఫలాలు మాట అటుంచి! వాన చిలకరింపులే పంటకాపుకు మూలం. ఎండ తీక్షణతే వాన కురిపిస్తుంది కూడ. అలానే అధిక దుఃఖంవల్ల కన్నీటి జల్లులొస్తాయి. అవే ఓదార్పు ఫలాలు పండిస్తాయి.

ఇలాంటి దుఃఖం రెండు విధాలుగా ఫలితమియ్యొచ్చు. మన దుఃఖంవల్ల ఎదుటి మానవుల సానుభూతిని చవిచూడొచ్చు. ఆపై అంతస్థులో దేవుని కృపాకనికరాన్ని చవిచూడొచ్చు. ఆ వరుసకొస్తే _ ఎంతో మంది తమ దుఃఖార్తిలోనే తోడి మానవునిలో, దేవునిలోగల ఔన్నత్యాన్ని కనుగో గలిగారు. జీవితం నల్లేరు మీద నడకలా సాఫీగా జరిగేప్పుడే హృదయ సౌందర్యాలు బయటపడవు. పైపై మెరుగులే మిరుమిట్లు కొలుపుతాయి. దుఃఖంలో జీవితంలోని లోతుపాతుల్లో అందుండే అగాధ ఆణిముత్యాల సరుల్ని కనుగొంటాం. వానితో ఆత్మీయ స్థైర్యాన్ని, సౌందర్యాన్ని సంతరించుకొంటాం.

సుఖసుందరితో నడిచానొక మైలు దూరం
 దోవంతా వాగుతూ వలకపోసింది వయ్యారం
చెప్పిందంతా అయింది వట్టి మాటల బండారం
 మెదడుకైతే అంటలేదు కించెత్తు సింగారం!

దుఃఖకాంతతో నడిచానదే మైలుదూరం
 పల్లెత్తి మాటైనా అనకుండానే జరిగింది సంచారం
ఓయబ్బో - అనుపించింది దానిమాటే బంగారం
 అయితేనేం, ఆ మూగ చెంత నేర్చానెంతో జీవితసారం!

**2**

మన విషయమెలా ఉన్నా, కొందరు లోకంలో, లోకవాసుల్లో ఉండే శ్రమల్ని, దుఃఖాన్ని చూచి దుఃఖపడతారు. మొదటి ధన్యతను చూచినప్పుడు లోకానికి, అందలి సమస్త వ్యామోహాలకు దూరంగా ఉండాలని చూచాం. అలా అని సంఘ పరిత్యాగులమటం (సన్యసించటం) క్రైస్తవ బోధకాదు. సంఘంలోని కుళ్ళు, కడుగుతో తాదాత్మ్యం చెంది దానికోసం పరితపించటంలో ధన్యత ఉంది. ఎదుటి వారి దుస్థితికి దుఃఖించి, ద్రవించిన వారే లోక కళ్యాణానికి దోహదకారు లయ్యారు. పేదరికాన్ని నిర్మూలించారు; బానిసత్వాన్ని పారద్రోలారు; మనుష్యుల్లో మానవత నుండి దిగజారి, (dehumanised) అణగారి అర్రులు చాచే వారికి ఆదరణ కలుగజేసిన మానవాగ్రగణ్యులెందరో భూమి మీద తమ అడుగుజాడలను ముద్రించారు. విరాళాలిచ్చారు. ఆశ్రమాలు కట్టించారు. ఉద్యమాలు నడిపారు. ప్రాణత్యాగాలు కూడ చేశారు. హతసాక్షులయ్యారు. వేయేల, మానవ జీవితంలోని దేవుడైన యేసును సహితం ఈ దుఃఖమే అనేక అద్భుతాలు చేయించింది. ఇతరుల దుఃఖానికి తీవ్రంగా స్పందించని వారే లేకుంటే ఈ లోకం ఇంకా దౌర్భాగ్యమయ్యేది.

క్రైస్తవ్యమంటేనే ఇతరులను గురించిన శ్రద్ధ. ఈ కోవలో ఎదుటి (పొరుగు) వాని దుఃఖానికి దుఃఖించటం ఎంత ధన్యత! వారు ఇతరుల పరామర్శలో ఓదార్పు తప్పక పొందుతారు!

**3**

అయితే, పరలోకరాజ్య ప్రణాళికా ప్రకటన సంధర్భంలో చెప్పిన ఈ సూత్రం, ప్రధానంగా, తన స్వంత పాపభారం నిమిత్తం, తన స్వంత దిక్కుమాలిన స్థితిని గురించి నిస్సహాయంగా దుఃఖపడే వారి ధన్యతను గురించి చెప్పబడింది.


అందుకే, ఈ దుఃఖం అపారమయింది. యోసేపు మరణించాడని విని యాకోబు పొందిన వేదన, గుడ్డలు చింపుకొని గోనెపట్టలు ధరించి విలపించేంత దుఃఖం. 'రాత్రింబగళ్ళు నా కన్నీళ్ళు నాకు అన్నపానములాయెను' అని కోరహు కుమారులు రచించిన కీర్తనలో వలె (కీర్త. 42:3).

యేసుప్రభువు సువార్తలో మొట్టమొదటి మాట 'మారుమనస్సు పొందుడి' అని. ఏ మానవుడు కూడ తన స్వంత పాపాలకోసంగా పరితపించకుండ పశ్చాత్తాపపడలేడు. యాకోబు పత్రికలో _ 'వ్యాకులపడుడి; దుఃఖపడుడి, యేడువుడి, మీ నవ్వు దుఃఖమునకును మీ ఆనందము చింతకును మార్చుకొనుడి' (4:9) అన్నట్లు. ఈ దుఃఖము కేవలం దుఃఖంకోసం కాదు; మారుమనస్సు కోసం అని పౌలు 2కొరిం. 9:11లో చెప్పింది గమనార్హం. లోకసంబంధమైన దుఃఖము మరణమును కలుగజేయును' (వ.10), అయితే, పశ్చాత్తాప దుఃఖము నిత్యజీవం కలుగజేస్తుంది.

అట్టి దుఃఖాన్ని పుట్టించ కలిగింది క్రీస్తు సిలువ ఒక్కటే. ఆ సిలువను చూచినప్పుడు కాని పాపం మనకేం చేయగలదో అర్థమౌతుంది. పరిపూర్ణ సౌందర్యవదనుడైన యేసును స్వరూపం లేకుండా చితుకగొట్టింది. పాపం సృష్టించే భీభత్సాన్ని అవగాహన చేసుకొంటేగాని మనలో దుఃఖంరాదు.

అందుకే, తన స్వంత పాపాలకోసం దుఃఖపడేవారు ధన్యులౌతారు. వారికి రక్షణ. అదే ఓదార్పు. ఆదరణ. విరిగిన హృదయం - దొరికే ఆదరణ.

విరిగిన మనస్సే దేవునికిష్టమైన బలులు
విరిగిన హృదయమును నీవు అలక్ష్యము చేయవు_
 కీర్త.51:17



వచ్చే మాసం: సాత్వీకం - భూస్వాస్థ్యం

## చందాదారుల వివరాలు

| | |
|---|---|
| శ్రీమతి కె. సుభద్ర, విజయవాడ | రూ. 2,000 |
| శ్రీ కెల్లి ఐజక్ సుకుమార్, ఒంగోలు, ప్రకాశం జిల్లా | రూ. 2,000 |
| శ్రీమతి పి. అనిత, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం జిల్లా | రూ. 1,200 |
| కుమారి జయదేవి, గుంటూరు | రూ. 1,000 |
| శ్రీమతి ఆర్. జయమ్మలాబాను, గుంతకల్ | రూ. 1,000 |
| శ్రీమతి సి. హెచ్.సుభాషిణి, గుడివాడ, కృష్ణాజిల్లా | రూ. 1000 |
| శ్రీ కె. ఐజక్ ఒంగోలు, ప్రకాశం జిల్లా | రూ. 1000 |
| పేరు తెలీదు (21-2-18 తేది) బ్యాంక్ అకౌంట్ | రూ. 1000 |
| శ్రీమతి రాజ్యలక్ష్మి, భోపాల్ | రూ. 1000 |
| శ్రీమతి రత్నకుమారి, కరీంనగర్ | రూ. 500 |
| శ్రీ పరుసు వెంకటరావు, బెంగుళూరు | రూ. 500 |
| శ్రీ పి. యేసుబాబు లోకేష్, ఎర్రంపల్లి, ప.గో.జిల్లా | రూ. 500 |
| శ్రీ పి. దేవదానం, నగరంపాలెం, గుంటూరు | రూ. 500 |
| కుమారి లీనా, బెంగుళూరు | రూ. 500 |
| శ్రీ వి. యోహాను, వనపర్తి, మహబూబ్‌నగర్‌జిల్లా | రూ. 500 |
| శ్రీమతి కె.లూథియ, గోగులమూడి, గుంటూరుజిల్లా | రూ. 500 |
| శ్రీ యం. నిర్మల్‌కుమార్, అనంతపురం | రూ. 500 |
| శ్రీ ఎ. శ్రీనివాసరెడ్డి, హైదరాబాద్ | రూ. 500 |
| కుమారి యం. విక్టోరియారాణి, యర్రగొండపాలెం | రూ. 500 |
| శ్రీ ఏ. పరిశుద్ధ రాజు, నరసాపురం | రూ. 500 |
| పాస్టర్.టి.రమేష్ అబ్రాహాము, పెన్నాడ, ప.గోజిల్లా | రూ. 500 |
| శ్రీ పి. ఇమ్మానియేలు, విజయవాడ | రూ. 500 |
| శ్రీమతి గ్రేస్ మంజుల, బెంగళూర్ | రూ. 500 |
| పేరు తెలీదు (తేది12-10-17) బ్యాంక్ అకౌంట్ | రూ. 400 |
| పాస్టర్ పి. సత్యానందం, మౌలాలి, హైదరాబాద్ | రూ. 300 |
| పాస్టర్ జి. నల్లయ్య, కందుకూరు, ప్రకాశంజిల్లా | రూ. 300 |
| శ్రీ కె. సురేష్, ఉప్పరపల్లె, కడప జిల్లా | రూ. 300 |
| శ్రీ టి. నాగరాజు, చీమకుర్తి, ప్రకాశంజిల్లా | రూ. 300 |
| శ్రీ ఐ. అనిల్‌కుమార్, కాకినాడ, తూ.గో.జిల్లా | రూ. 300 |
| శ్రీమతి వి.శారాభాయి, భీమవరం | రూ. 300 |
| శ్రీమతి యం. పుల్లమ్మ, కడప | రూ. 300 |
| శ్రీ బాలాజీరావు సింథియా, వైజాగ్ | రూ. 300 |
| కుమారి షెఫేలా, దొనకొండ, ప్రకాశం జిల్లా | రూ. 300 |
| శ్రీ కె. ఉజ్జీవరాజు, వనపర్తి, మహబూబ్‌నగర్‌జిల్లా | రూ. 250 |
| శ్రీమతి వి. శారాభాయి, భీమవరం, ప.గో.జిల్లా | రూ. 250 |
| శ్రీ ఆర్. ఇన్నయ్య, గుంతకల్లు | రూ. 200 |
| శ్రీ టి. చిన్నా, మల్కిపురం, తూ.గో.జిల్లా | రూ. 200 |
| శ్రీమతి బి. ప్రేమలత, కడప | రూ. 200 |
| శ్రీమతి కె. వాణికుమారి, చీరాల, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీ డి. సుమన్, రుద్రాంగి, కరీంనగర్‌జిల్లా | రూ. 200 |
| పాస్టర్ పి. కొర్నేలి, మామిళ్ళపల్లి, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీమతి జి. లీలారాణి, ఒంగోలు, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీ బి. నాగభూషణం, వెంకటగిరి, నెల్లూరుజిల్లా | రూ. 200 |
| శ్రీ పి. దేవదానం, పెదదోర్నాల, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| కుమారి కె. లక్ష్మిప్రియ, ఒంగోలు | రూ. 200 |
| శ్రీ కె. దుర్గాప్రసాద్, రాజమండ్రి | రూ. 200 |
| శ్రీ పి. గిద్యోను, నేరేడ్‌మెట్, హైదరాబాద్ | రూ. 200 |
| శ్రీ వై. జోసఫ్, భీమవరం, ప.గో.జిల్లా | రూ. 200 |
| శ్రీమతి టి.నిర్మలశాంసన్, వెలిగండ్ల, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీమతి కె. ప్రేమారూత్, గుంటూరు | రూ. 200 |
| శ్రీ కె. జెకర్యా, నర్సీపట్నం, విశాఖపట్నజిల్లా | రూ. 200 |
| శ్రీమతి యం. అరుణకుమారి, విశాఖపట్నం | రూ. 200 |
| శ్రీ కె. యెషయా, ఆర్.జి.పురం, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీమతి టి. సుమలత, ఆర్.జి.పురం, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీమతి ఎన్. సరోజిని, నెల్లూరు | రూ. 200 |
| శ్రీమతి జి. రోజమ్మ, చీరాల, ప్రకాశం జిల్లా | రూ. 200 |
| శ్రీమతి సి.హెచ్. పుష్పారాణి, కాకినాడ | రూ. 200 |
| శ్రీ కె. లాజరస్, కొయ్యలగూడెం, ప.గో.జిల్లా | రూ. 200 |
| శ్రీ యం.శ్రీకర్‌కుమార్, జజ్జూరు, కృష్ణాజిల్లా | రూ. 200 |
| శ్రీ ఆర్. శ్రీనివాస్, రావులపాలె, తూ.గో.జిల్లా | రూ. 200 |
| శ్రీ పి. దేవదానం, నగరంపాలెం, గుంటూరు | రూ. 200 |
| శ్రీ యం. ఐజక్, దాసన్నపేట, విజయనగరం | రూ. 200 |
| శ్రీమతి కె. హేమాబాబ్జి, భీమవరం | రూ. 200 |
| శ్రీమతి జె.డి. సుహాసిని ,రాజమండ్రి,తూ.గో జిల్లా | రూ. 200 |
| శ్రీ సి.హెచ్.రామక్రిష్ణ, ఏలూరు, ప.గో జిల్లా | రూ. 200 |
| శ్రీ కె.రవికుమార్, హైదరాబాదు | రూ. 200 |
| శ్రీ కె.వి.వి.రమణ, గండేపల్లి, తూ.గో జిల్లా | రూ. 200 |
| శ్రీ యం. అబ్రాహాము, తాడేపల్లి, గుంటూరు | రూ. 200 |
| పేరు తెలీదు (తేది.7-4-18), బ్యాంకు అకౌంట్ | రూ. 200 |
| పేరు తెలీదు (తేది.15-4-18), బ్యాంకు అకౌంట్ | రూ. 200 |
| శ్రీ టి. మరియబాబు, గొట్టిపాడు, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీమతి బి. కళ్యాణి, బెంగుళూరు | రూ. 200 |
| పాస్టర్ బి. నెహెమ్యా, చిన్నగంజాం, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| యు. మేరి సలోమి, సిరివెళ్ళ, కర్నూలు జిల్లా | రూ. 200 |
| శ్రీ కె. సందీప్‌తేజ, సూళ్ళూరుపేట, నెల్లూరుజిల్లా | రూ. 200 |
| శ్రీ పి. జగదీష్, మధిర, ఖమ్మం జిల్లా | రూ. 200 |
| శ్రీ యల్. నాగరాజు, నంధ్యాల, కర్నూలు జిల్లా | రూ. 200 |
| శ్రీ యస్. గోపి, పార్వతీపురం,విజయనగరం జిల్లా | రూ. 200 |
| శ్రీ యస్. విద్యాసాగర్, ఆత్మకూరు,కర్నూలు జిల్లా | రూ. 200 |
| శ్రీమతి కె. లలిత భాగ్యం, కనిగిరి, ప్రకాశం జిల్లా | రూ. 200 |
| పేరు తెలీదు (7-2-19 తేది) బ్యాంక్ అకౌంట్ | రూ. 200 |

| | | |
|---|---|---|
| శ్రీ ఐ. రాజ్‌కుమార్, గుంటూరు | రూ. | 200 |
| శ్రీమతి.టి. సూర్యకుమారి, మహబూబ్ నగర్ | రూ. | 200 |
| శ్రీ కొట్టె కమల్, శ్రీరాంపురం, ఆదిలాబాద్ | రూ. | 150 |
| పాస్టర్ జె. జయరాములు, కాకినాడ | రూ. | 150 |
| పాస్టర్ ప్రకాశం, నారాయణపురం, వరంగల్‌జిల్లా | రూ. | 150 |
| శ్రీ కె.జె. జ్యోతిరాజ్, మార్కాపురం | రూ. | 150 |
| శ్రీ పి. ఆనంద్‌సాగర్, కాకినాడ | రూ. | 150 |
| పాస్టర్ వి.ఎ.యన్.ప్రసాద్, జడ్చర్ల | రూ. | 150 |
| పాస్టర్ టి. విజయపాల్, నరసరావుపేట | రూ. | 150 |
| శ్రీమతి బి. ఎస్తేర్‌రాణి, గోగులమూడి, గుంటూరు జిల్లా | రూ. | 150 |
| పాస్టర్ టి. ఆదాము, శంకవరప్పాడు, ప్రకాశంజిల్లా | రూ. | 150 |
| పాస్టర్ ఎ మత్తయ్య, వినుకొండ, గుంటూరు జిల్లా | రూ. | 150 |
| శ్రీ పి. చిన్నారావు, విజయవాడ, కృష్ణాజిల్లా | రూ. | 150 |
| శ్రీమతి పి. విజయలక్ష్మి, ఎర్రగొండపాలెం, ప్రకాశం జిల్లా | రూ. | 150 |
| శ్రీ టి. సునీల్‌కుమార్, కోవెరపాలెం, నెల్లూరుజిల్లా | రూ. | 150 |

**ఆగష్టు నెలలో చందా కట్టిన వారు**

| | | |
|---|---|---|
| శ్రీ కెల్లి ఐజక్ సుకుమార్, ఒంగోలు, ప్రకాశం జిల్లా | రూ. | 1,000 |
| శ్రీ యం.శ్యాంబాబు, కైకలూరు, కృష్ణా జిల్లా | రూ. | 500 |

**మనియార్డరు ద్వారా, నెట్ బ్యాంకింగ్ ద్వారా డబ్బు ట్రాన్స్‌ఫర్ చేసిన వారు తప్పని సరిగా మాకు ఫోన్ చేసి తెలియజేయాలి. లేనిచో వారి పేరు చందాదారుల లిస్టులో ఉండదు. చందాకట్టిన వారిలో ఎవరి పేరైనా లేనిచో దయచేసి 9440217726 నంబరుకి ఫోన్ చేయమని కోరుచున్నాము**

**బైబిల్ క్విజ్ - 49 ప్రశ్నలకు జవాబులు వ్రాసిన వారు :**


1) **శ్రీమతి ఆర్.జయమ్మలాబాను,** గుంతకల్లు
2) **శ్రీమతి వై. కెజియా సత్యసారధి,** హైదరాబాద్
3) **శ్రీమతి జె.డి.సుహాసిని,** రాజమండ్రి
4) **శ్రీమతి కె. సుభద్ర,** విజయవాడ
5) **కుమారి. లక్ష్మిప్రియ,** ఒంగోలు, ప్రకాశం జిల్లా
6) **శ్రీమతి కె. లలితాభాగ్యం,** కనిగిరి, ప్రకాశం జిల్లా
7) **శ్రీమతి యు. ప్రభావతి,** సిరివెళ్ళ, కర్నూలు జిల్లా
8) **శ్రీ జె. జయరాములు,** కాకినాడ తూ.గో.జిల్లా
9) **శ్రీ సి.హెచ్. దేవదానం,** చెన్నై

## ప్రకటన

**క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. ఉత్తమ కథకు నగదు బహుమానం వుంటుంది. క్రైస్తవకథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.**

# ఈ నెల ప్రశ్న -సెప్టెంబర్-2019

**ఎన్ని దినములు తాళుకొని కనిపెట్టుకొనువాడు ధన్యుడు?**
(దానియేలు) (రెఫరెన్సు తప్పని సరిగా ఉండాలి)




మీ జవాబు ఈ నెల 20వ తేదీ లోపు మీ పేరు, పత్రిక సీరియల్ నంబరుతో 9440217726 నంబరుకి **SMS** ద్వారా పంపించాలి. సరైన సమాధానం పంపిన వారిలో 'లక్కిడిప్' ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి రూ.125/-లు విలువ చేసే **'ఆంధ్రక్రైస్తవ ఉజ్జీవ కీర్తనలు'** అనే 1000 పాటలు ఉన్న పుస్తకము బహుమతిగా ఇవ్వబడుతుంది. అయితే ఈ అవకాశం **'చందాదారులకు మాత్రమే'**. అనగా చందా చెల్లించిన వారు మాత్రమే ఈ ప్రశ్నకు జవాబు పంపించాలి. 20వ తేది లోపు చందా చెల్లించే వారు కూడా పాల్గొనవచ్చును.

**ఆగష్టు నెల ప్రశ్నకు జవాబు పంపించిన వారు**
జవాబు : పండ్రెండు (యెహెజ్కేలు.43:16)

1) శ్రీ జె. జయరాములు, కాకినాడ తూ.గో.జిల్లా
2) కుమారి.కె. లక్ష్మీప్రియ, ఒంగోలు ప్రకాశం జిల్లా
3) శ్రీమతి వై.కెజియా సత్యసారధి, హైదరాబాద్
4) కె. లలితాభాగ్యం, కనిగిరి, ప్రకాశం జిల్లా
5) శ్రీమతి జె.డి.సుహాసిని, రాజమండ్రి
5) శ్రీ టి. నాగార్జున, హుజురాబాద్, కరీంనగర్‌జిల్లా

# బైబిల్ క్విజ్ - 49 జవాబులు

**1.**ఇశ్రాయేలువారు (హోషేయ 8:8) **2.**ఎఫ్రాయిము (9:11) **3.**యెహోవా(10:12) **4.**యూదా వారు(11:12) **5.** సిరియా (12:12) **6.** 13:14 **7.**యెహోవా (14:9) **8.**పెతూయేలు (యోవేలు 1:1) **9.**యెహోవాపిలుచువారు (2:32) **10.** సీయోనులో (3:21) **11.** కీరు (ఆమోసు 1:5) **12.**యూదా వారు (2:4) **13.** 3:3 **14.** సొదొమ గొమొఱ్ఱా (4:11) **15.**న్యాయము (5:24) **16.**దావీదు (6:5) **17.**అమజ్యా (7:10) **18.** 8:7 **19.** యాకోబు (9:8) **20.** గిలాదు (ఓబద్యా 1:19)



# అక్షరయజ్ఞం

## బైబిల్ క్విజ్ - 50

(యోనా, మీకా, నహూము, హబక్కూకు, జెఫన్యా)



శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

1. యోనా ఎన్ని దినములు మత్స్యము కడుపులో ఉండెను? (యోనా 1అ)
2. --- యొద్దనే రక్షణ దొరుకును? (2అ)
3. నీనెవె పట్టణం ఎన్ని దినములకు నాశనము కాబోతుందని యోనా ప్రకటించాడు? (3అ)
4. ఏ చెట్టును చూచి యోనా బహు సంతోషించెను? (4అ)
5. ప్రలాపము ఎక్కడ మొదలుపెట్టి జరుగుచున్నది? (మీకా 1అ)
6. " యథార్థముగా ప్రవర్తించువానికి నా మాటలు క్షేమసాధనములు కావా"? రిఫెరెన్స్ ఏమిటి? (2అ)
7. ఎవరు ద్రవ్యము కొరకు సోదె చెప్పుదురు? (3అ)
8. "అయితే, వారు ఆయన తలంపులు తెలిసికొనకున్నారు" రిఫెరెన్స్ ఏమిటి? (4అ)
9. "నీ శత్రువులందరు నశిందురు గాక!" రిఫెరెన్స్ ఏమిటి? (5అ)
10. నీ ----- నిన్ను పాడు చేసి మొత్తుదును. పూరించుము? (6అ)
11. " ఆయన మరల మనయందు జాలిపడును" రిఫెరెన్స్ ఏమిటి? (7అ)
12. నీవు పనికిమాలినవాడవు గనుక నేను నీకు ---- సిద్ధపరచుచున్నాను. (నహూము 1అ)
13. కట్టబడినప్పటి నుండి నీనెవె పట్టణము ఎలా ఉన్నది? (2అ)
14. ---- కాలమునకు నీళ్ళు చేదుకొనుము. (3అ)
15. "నీ కనుదృష్టి దుష్టత్వము చూడలేనంత నిష్కళంకమైనది గదా" రిఫెరెన్స్ ఏమిటి? (హబక్కూకు 1అ)
16. యెహోవా ఎక్కడున్నాడు? (2అ)
17. " ప్రభువగు యెహోవాయే నాకు బలము" రిఫెరెన్స్ ఏమిటి (3అ)
18. ఎవరు మహారోదనము చేయుదురు? (జెఫన్యా 1అ)
19. ఏ దేశము సొదొమ పట్టణము వలె అగును (2అ)
20. " ఆయన బహు ఆనందముతో నీయందు సంతోషించును" రిఫెరెన్స్ ఏమిటి? (3అ)

**గమనిక :**- మీ జవాబులను **SMS/Whatsapp**ద్వారా కూడా పంపవచ్చును. **SMS/Whatsapp** ద్వారా పంపేవారు మీ పేరు, అడ్రస్ లేబుల్ మీద ఉన్న సీరియల్ నంబరుతో **"బైబిల్ క్విజ్-50"** అని టైపు చేసి, ప్రశ్న నంబరు, జవాబు, బైబిల్ రెఫెరెన్సుతో జవాబులన్నీ ఒకే మేసేజ్‌లో 9440217726 నంబరుకు పంపాలి. పోస్టుకార్డు లేదా ఎన్వలప్ కవరు ద్వారా జవాబులు (తెల్లపేపరు మీద, అడ్రస్ లేబుల్ మీద ఉన్న సీరియల్ నంబరు, మీ ఫోన్ నంబరు వ్రాసి) పంపదలచిన వారు ఈ నెల 20వ తేదిలోపు **పరిశుద్ధత-బైబిల్ క్విజ్, పోస్ట్‌బాక్స్ నెం.28, ఒంగోలు-523001** అడ్రసుకు పంపగలరు.

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం.